ప్రజాశక్తి
బుధవారం 19 మార్చి 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

తాగునీటికి తిప్పలు

◆ గెడ్డనీరే గిరిజనులకు దిక్కు ◆ ఎండలతో తగ్గుతున్న ఊటలు
◆ నాన్ షెడ్యూల్ గ్రామాల్లో వెంటాడుతున్న సమస్య

ఊట నీరు పడుతున్న పశువుల బంద గిరిజన మహిళలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాల్లో వేసవి రాకముందే తాగునీటి సమస్యలు ప్రారంభమయ్యాయి. నాన్ షెడ్యూల్ మండలాల్లోని శివారు గిరిజన గ్రామాల్లో తాగునీటి వనరుల్లేక గెడ్డ నీటిని మహిళలు కాలినడకన బిందెలతో మోసుకొని తెస్తున్నారు. కొండలపై నివశిస్తున్న గిరిజన గ్రామాలకు ఎంపీ, ఎమ్మెల్యే, అధికారులెవరూ వెళ్లకపోవడంతో తాగునీటికి గిరిజనులు పడుతున్న బాధ వారికి తెలీడంలేదు. నాన్ షెడ్యూల్ పరిధిలోకి వచ్చే నాతవరం, గొలుగొండ, దేవరాపల్లి, వి.మాడుగుల, రావికమతం, చీడికాడ, రోలుగుంట, కోటవురట్ల మండలాల్లోని 58 పంచాయతీలు, 320 నాన్‌షెడ్యూల్ గిరిజన గ్రామాల్లో దాదాపు 85 వేల మంది గిరిజనులున్నారు. వీరిలో సగం మంది గిరిజనులకు సురక్షిత నీరు అందుబాటులో లేదు. పివిటిజి గ్రామాల్లో తాగునీటి సమస్య మరింత తీవ్రంగా వుంది. ఏటా గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య కొనసాగుతోంది. తాగడానికి మంచినీరు ఊర్లోలేక గెడ్డ నీరు తెచ్చుకున్న గిరిజనుల పట్ల ఏ మాత్రం ప్రభుత్వ యంత్రాంగం దయ చూపడంలేదు.

జిల్లాలోని రోలుగుంట మండలం ఆర్ల పంచాయతీ పెదగరువులో 12 కుటుంబాలు, రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ జీలుగులోవ, సోంపురం బంధలో 13 కుటుంబాలు, వి.మాడుగుల మండలం అవురువాడ పంచాయతీ పరిధిలో పశువుల బందలో ఆరు పివిటిజి కుటుంబాలు ఎంతోకాలంగా వుంటున్నాయి. వీరు కాకుండా అనేక పివిటిజి కుటుంబాలు కొండపైన జీవిస్తున్నాయి. ఇంటింటికీ కొళాయి ద్వారా తాగునీరు సరఫరాచేసే జల్ జీవన్ మిషన్ పథకం ఫలితాలు పివిటిజి గ్రామాలకు అందలేదు. తాగునీటి సౌకర్యంలేని గిరిజనులు గ్రామాలను ఆనుకొని లేదా దూరంగావున్న గెడ్డ నీటిపై మిగతా 2లో..

మద్దతు ధర, క్రషింగ్ సరిగా లేక

చెరుకు తోటకు నిప్పు పెట్టిన రైతు

కాలిపోతున్న చెరుకుతోట

రైతు వెంకటరావు

ప్రజాశక్తి - దేవరాపల్లి : ఓ వైపు ప్రభుత్వం నుంచి మద్దతు ధర దక్కకపోవడం, సుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ సక్రమంగా లేకపోవడం వల్ల అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం కొత్తపెంట గ్రామానికి చెందిన చెరుకు రైతు రొంగలి వెంకటరావు మంగళవారం తన చెరుకు తోటకు నిప్పు అంటించాడు. ఈ ఘటన చెరుకు రైతుల కష్టాలకు తార్కాణంగా నిలిచింది. వెంకటరావు తన 65 సెంట్లు భూమిలో చెరుకు తోట వేశాడు. సాగు ఖర్చుల కింద రూ.10,500 అయ్యాయి. గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి చెరుకును తోలడానికి, ఇతర ఖర్చుల కింద రూ.4 వేలు అవుతాయని అంచనా వేశాడు. ఒకవేళ పంటను కూలీలతో నరికించి ఫ్యాక్టరీకి తరలించినా ఖర్చు తప్ప ప్రయోజనం లేదని భావించాడు. పెట్టిన పెట్టుబడి కూడా రాదని తీవ్ర మనస్తాపం చెంది పండించిన చెరుకు తోటకు తప్పని పరిస్థితిలో నిప్పంటించాడు. విషయం తెలుసుకున్న వెంటనే సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ గానుగాట తరుచూ ఆగిపోవడంతో ఇటు రైతులు, అటు కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో సహకార రంగంలో నడుస్తున్న ఏకైక సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వాలు ఆదుకోకపోడంతో ఈ ఫ్యాక్టరీ భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు. ఫ్యాక్టరీ లేకపోతే జిల్లాలోని 11 మండలాల్లో ఉన్న చెరుకు రైతులు, కార్మికులు రోడ్డున పడతారని తెలిపారు. అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్ గతంలో ఈ ఫ్యాక్టరీ విషయంలో చాలా హామీలు ఇచ్చారని, ఇప్పుడు ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న స్థానిక ఎమ్మెల్యేలకూ చెరుకు రైతుల కష్టాలు పట్టడం లేదన్నారు. ఫ్యాక్టరీని మూసివేస్తే దాన్ని మిగతా 2లో..

టిడ్కో ఇళ్లను తక్షణమే పంపిణీ చేయాలి

▶ వార్త 8లో..

గుర్తు తెలియని మహిళ దారుణ హత్య

▶ వార్త 2లో..

జోరుగా సిఐఎస్ఎఫ్ సైక్లోథాన్

▶ వార్త 6లో..

నేడు ఎంఎస్ఎంఇల సాధికారతపై సదస్సు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సాధికారత దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం విశాఖపట్నం నోవాటెల్ హోటల్ వేదికగా సిఐఐ సహకారంతో ఏపి ఎంఎస్ఎంఇ అభివృద్ధి కార్పొరేషన్, నీతి ఆయోగ్ సంయుక్తంగా 'ఎగుమతి ఆధారిత వృద్ధి - ఆవిష్కరణల కోసం ఎంఎస్ఎంఇలను సాధికారపరచడం' అనే అంశంపై ప్రత్యేక సదస్సు జరుగనుంది. ఈ మేరకు స్థానిక అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేస్తూ ఎంఎస్ఎంఇ సిఇఒ లేఖ రాశారు. వర్క్‌షాప్‌లో ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, నీతి ఆయోగ్ సిఇఒ సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ కార్యదర్శి (పరిశ్రమలు, వాణిజ్యం) ఎన్.యువరాజ్, ఇతర ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు పాల్గొనున్నట్లు తెలిపారు. సుమారు 250-300 మంది ఎంఎస్ఎంఇ వ్యవస్థాపకులు, ఔత్సాహికులు పాల్గొంటారని భావిస్తున్నట్లు వెల్లడించారు.

ఈ మేరకు జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. పక్కా ఏర్పాట్లు చేయాలని, సమన్వయ లోపం రాకుండా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిం చాలని పేర్కొన్నారు.

28న తపాలా అదాలత్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం పోస్టల్ రీజియన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యలను పరిష్కరించే నిమిత్తం ఈ నెల 28న ఉదయం 11 గంటలకు ఎంవిపి బస్ కాంప్లెక్స్ పక్కన ఉన్న పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయంలో పోస్టు మాస్టర్ జనరల్ వారిచే 117వ తపాలా అదాలత్ నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తపాలా సర్వీసులకు సంబంధించిన ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులు మాత్రమే ఈ అదాలత్‌లో మిగతా 2లో..

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కామేశ్వరరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పిపిపి పేరిట వైద్య విద్య, వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు పూనుకోవడం దారుణమని, తక్షణమే ఆ ప్రక్రియను నిలిపివేయాలని అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. వివిధ సంస్థల ప్రతినిధులు హాజరై ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో ప్రమాదకరమైన పిపిపి విధానాన్ని అమలు చేయడానికి సిద్ధమవడం దుర్మార్గమన్నారు. ఈ విధానం ద్వారా ప్రభుత్వ వైద్య కళాశాలలు, అనుబంధ ఆసుపత్రులు ప్రైవేట్ సంస్థల ఆధీనంలోకి వెళ్తాయని తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రారంభించిన సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని విమర్శిస్తూనే, అదే విధానాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేయడానికి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. తొలుత సభాధ్యక్షులు, ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పిపిపి విధానం పేద ప్రజలకు వైద్యాన్ని దూరం చేస్తుందన్నారు. ఆంధ్ర మెడికల్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ఎన్.రాజు మాట్లాడుతూ వైద్య విద్యను ప్రైవేటీకరించడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వమే వైద్య కళాశాలలను నిర్వహించాలన్నారు. రిటైర్డ్ డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ పి.రామారావు మాట్లాడుతూ పిపిపి విధానం వల్ల వైద్య ఖర్చులు విపరీతంగా పెరుగుతాయని తెలియజేశారు. ఇప్పటికే ఆరోగ్య రంగంలో ఖర్చులు భరించలేని స్థాయిలో ఉన్నాయని, ప్రైవేటీకరణతో ఈ పరిస్థితి మరింత దిగజారుతుందని అన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.మురళీధర్ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ వాణిజ్యీకరణను, కార్పొరేట్ లాభాలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. మానసిక వైద్య నిపుణులు డాక్టర్ నిహాల్ మాట్లాడుతూ ప్రైవేటీకరణ వల్ల మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

తాగునీటికి తిప్పలు

ఆధారపడుతున్నారు. వేసవిలో కొండల నుంచి వచ్చే నీటి ఊటలు తగ్గిపోవడంతో సమీపంలో నీరులేక దూరంలోని గెడ్డలకు మహిళలు వెళ్తున్నారు. గెడ్డ నీరు, ఎండలకు అడుగంటిపోతున్న కలుషిత నీటిని తాగడంతో గిరిజనులు తరుచూ అనారోగ్యాల బారినపడుతున్నారు. జీలుగులోవకు చెందిన సిదర వెంకటరావు కలుషిత నీరు తాగి అనారోగ్యంతో బాధపడుతూ మరణించాడని స్థానికులు తెలిపారు. పశువుల బంద గిరిజనులకు చిన్నపాటి ఏ ఆరోగ్య సమస్య వచ్చినా డోలీ కట్టుకొని దాదాపు ఎనిమిది కిలోమీటర్లు నడుచుకొని వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి సౌకర్యంలేక జీలుగులోవ గిరిజనులు మూడు కిలోమీటర్లు డోలి కట్టుకొని ఆస్పత్రులకు వెళ్తున్నారు. బోర్లు, బావులులేని ఇటువంటి గ్రామాలకు గ్రావిటీ ద్వారా నీటి సౌకర్యం కల్పించే అవకాశముంది. కానీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదు. 2022లో జీలుగులోవ గిరిజనులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని మానవ హక్కుల కమిషన్ ఆదేశించింది. దీంతో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ఐదు లక్షలతో మంచినీటి సౌకర్యం కల్పించేందుకు ప్రతిపాదనలు తయారుచేశారు. కానీ నిధులు విడుదల కాలేదు. తాగునీటి సౌకర్యం కల్పించి ఆదుకోవాలని జీలుగులోవకు చెందిన కొర్ర గౌరి, పెదగరువుకు చెందిన కిలో రుక్మ కోరారు.

తాగునీటి వసతి కల్పించకపోతే ఆందోళన

నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించాలి. పెదగరువు, జీలుగులోవ, సోంపురం, పశువుల బంద గిరిజనులకు తక్షణమే గ్రావిటీ ద్వారా మంచినీరు సరఫరా చేయాలి. నిధులు విడుదల చేసి పనులు వేగంగా చేయాలి. ప్రభుత్వ యంత్రాంగం అలసత్వం ప్రదర్శిస్తే జిల్లా పరిషత్ సమావేశం రోజున ఖాళీ బిందెలతో గిరిజనులతో నిరసన చేపడతాం. తాగునీటి సౌకర్యం కల్పించే వరకూ పోరాటం కొనసాగిస్తాం.

కె.గోవిందరావు,
సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ సభ్యుల

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

మానసిక ఆరోగ్య సేవలు కూడా ఖరీదైనవిగా మారుతాయని తెలిపారు. పీపుల్స్ ఫర్ ఇండియా నాయకులు బిఎల్.నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలన్నారు. కార్యక్రమంలో ప్రజా ఆరోగ్య పరిరక్షణ కమిటీ నాయకులు కెవిపి.చంద్రమౌళి, మెడికల్ విద్యార్థి డాక్టర్ జ్యోత్స్న, తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం పిపిపి ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో ప్రజలను చైతన్య పరిచి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఈ సమావేశం హెచ్చరించింది.

చెరుకు తోటకు నిప్పు పెట్టిన రైతు

ఎలా సొంతం చేసుకోవాలనే ఆలోచన ఇక్కడ ప్రజా ప్రతినిధులకు ఉన్నట్టు ప్రజలంతా భావిస్తున్నారని తెలిపారు.

చెరుకు తరలింపులో జాప్యం వద్దు : జెసి జాహ్నవి

రైతు నుంచి చెరుకు తరలింపులో జాప్యం లేకుండా సత్వర చర్యలు తీసుకోవాలని గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఎమ్‌డి సన్యాసినాయుడును జాయింట్ కలెక్టర్ జాహ్నవి ఆదేశించారు మద్దతు ధర లేదంటూ రైతు నిప్పు పెట్టిన ప్రాంతాన్ని ఆమె సాయంత్రం పరిశీలించారు. బాధిత రైతుతో మాట్లాడారు. పంటకు నిప్పు పెట్టాల్సిన పరిస్థితి ఎందుకొచ్చిందో ఆయన తన గోడును వెళ్లబోసుకున్నాడు. తనలాగా చాలామంది రైతులు ఆవేదనతో ఉన్నారని, వారికైనా న్యాయం చేయాలని కోరాడు.

గుర్తు తెలియని మహిళ దారుణ హత్య

దుప్పట్లో చుట్టి శరీర భాగాలను విసిరేసిన నిందితులు

దుప్పట్లో ఉన్న మహిళ శరీర భాగాలు

ప్రజాశక్తి - కశింకోట : అనకాపల్లి జిల్లా కశింకోట మండలం బయ్యవరం జంక్షన్‌కు సమీపంలో జాతీయ రహదారి కల్వర్టు కింద ఓ గుర్తు తెలియని మహిళ శరీర భాగాలు దుప్పట్లో కానరావడం తీవ్ర కలకలం రేపింది. దారుణంగా హత్య చేయడమే కాకుండా ఇలా శరీర భాగాలను వేరు చేసి దుప్పట్లో కుక్కి విసిరివేసిన ఘటన చర్చనీయాంశమైంది. మృతురాలి వయస్సు సుమారు 40 ఉంటుందని పోలీసులు తెలిపారు. కల్వర్టులో ఉన్న గోనె సంచిలో ఆమెకు చెందిన రెండు కాళ్లు, చెయ్యి లభ్యమయ్యాయని వెల్లడించారు. హంతకులు మృతదేహం ఆచూకీ దొరక్కుండా శరీర భాగాలను వేరు చేసినట్లు తెలుస్తోంది. జాతీయ రహదారిపై వెళ్లే ఏదో ఒక వాహనం నుంచి ఇలా ఆ మహిళ శరీర భాగాలను ఇక్కడకు విసిరేసి ఉంటారని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. మృతదేహం ఎక్కడి నుంచి వచ్చిందన్న అంశంపై పోలీసు దర్యాప్తును ముమ్మరం చేశారు. సంఘటనా స్థలాన్ని సిఐ అల్లుస్వామి నాయుడు, అనకాపల్లి డిఎస్‌పి శ్రావణి తదితరులు పరిశీలించారు. శరీర భాగాలు తాజాగా ఉండడంతో సోమవారం రాత్రి హత్య జరిగినట్లు భావిస్తున్నారు. వైద్య సిబ్బంది, క్లూస్ టీం రంగంలోకి దిగి మృతదేహాన్ని పరిశీలించాయి. మృతిపై హోం మంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం
: ఇన్‌ఛార్జి ఎస్‌పి వకుల్ జిందాల్

ఘటనా స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఇన్‌ఛార్జి ఎస్‌పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ నిందితులను గుర్తించి వెంటనే అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. సిసి ఫుటేజీలు, స్థానికుల సమాచారాన్ని విశ్లేషిస్తున్నామని తెలిపారు. ఘటనకు సంబంధించిన ఏ విధమైన సమాచారం ఉన్నా 9440796088 నెంబర్‌కు తెలియ జేయాలన్నారు.

28న తపాలా అదాలత్

(మొదటి పేజీ తరువాయి..) చర్చించబడతాయని పేర్కొన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని తపాలా వినియోగదారులు తమ సమస్యలను, ఫిర్యాదులను ఈ నెల 24లోగా '117వ తపాలా అదాలత్' కెవిడి సాగర్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్టుమాస్టర్ జనరల్ వారి కార్యాలయం, విశాఖపట్నం-530017' అను చిరునామాకు పంపాలని కోరారు. గడువు తేదీ తరువాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవని స్పష్టం చేశారు.

టైం బ్యాంక్‌తో వృద్ధులకు మేలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాజస్థాన్‌కు చెందిన పిసి జైన్, అతని బృందం అభివృద్ధి చేసిన టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాన్సెప్ట్‌తో వయోవృద్ధులకు ఒంటరితనం పోతుందని, అవసరమైన సమయంలో తోడు దొరుకుతుందని, సాంత్వన లభిస్తుందని, సహాయకులు అండగా నిలుస్తారని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. వయో వృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం విభిన్న రీతిలో కృషి చేస్తోందని, దానిలో భాగంగానే టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంస్థ సహకారంతో విశాఖను పైలట్ జిల్లాగా ఎంపిక చేసి తద్వారా వృద్ధులకు అండగా నిలిచేందుకు చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రెడ్ క్రాస్ సొసైటీ భవనం సమీపంలోని పెన్షనర్స్ అసోసియేషన్ భవన్‌లో జరిగిన ప్రత్యేక సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వృద్ధుల సంక్షేమం, ఇతర సేవల గురించి మాట్లాడారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎడి జె.మాధవి, క్రైం డిసిపి రాజ్ కమల్, డిఆర్‌డిఎ పీడీ లక్ష్మీపతి, ఆర్టీసీ ఆర్‌ఎం బి.అప్పలనాయుడు, విఎస్.కళాశాల ప్రిన్సిపాల్ విజయ బాబు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

This is to inform the general public that a package containing important land documents belonging to M. Venkata Rao was lost while being transported from Old Gajuwaka to Visakhapatnam on February 13, 2025, during travel by Auto. The lost documents include, but may not be limited to, the following: Registered Sale Deed No.776/2010 - SRO Pedagantyada; Registered GPA No.165/2006 - SRO Gajuwaka; Registered Sale Deed No. 9763/1984 - SRO Visakhapatnam; Registered Sale Deed No. 2397/2008 - SRO Gajuwaka; Registered Sale Deed No. 1579/1994 - SRO Gajuwaka. If anyone has found the lost documents, please reach out to us immediately for a reward. Any person having any claim, charge, attachment, mortgage, or any other legal right over the property associated with the aforementioned documents is hereby requested to submit their claim within seven (7) days from the date of this notice. Failure to do so within the stipulated period shall be deemed as no existing claim, and the concerned party shall proceed accordingly.

SCHEDULE

SCHEDULE for Regd. Sale deed Document No 2397/2008:- All that piece and parcel of vacant land measuring 206.11 Sq. yards or 172.335 Sq. mtrs vacant site covered by Survey No. 217/24 of Kanithi Village in Gajuwaka Mandal , GVMC limits, Gajuwaka SRO, Visakhapatnam District and BOUNDED BY East: Property of Kovvuri Bairagi Raju, South: Road, West: Site of R. Appala Raju, North: Site of Kovvuri Satyanarayana. And SCHEDULE for Regd. Sale deed Document No 776/2010 All that site measuring 384 Sq yards or 321.075 Sq. mtrs vacant site covered by Patta No. 109 Survey No. 163/2 of Chinagantyada Village of Gajuwaka Mandal GVMC limits Pedagantyada SRO, Visakhapatnam District and BOUNDED BY East: Property belongs to Gondesi Atchanna, South: Property belongs to Indala Appalakonda, West: Property sold by Neradla Usha Rani, North: Road

R. MARY MANI, Advocate,
NGGO'S Colony, Akkayyapalem post
Visakhapatnam -16, Cell: 7893940797

మహారాజశ్రీ శృంగవరపుకోట జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A 469/2024 in O.S.136/2024

Between:
కుంద్రపు అప్పలరాజు ......పిటిషనర్/వాది
And:
విన్నకోట శ్రీనివాస దుర్గ....రెస్పాండెంట్/ప్రతివాది

ప్రతివాది :
విన్నకోట శ్రీనివాస దుర్గ W/o నాగేశ్వరరావు, డోర్ నెం.21-185, సాయి హాసిని ఎన్ క్లేవ్స్ ఎదురుగా, సింహాచలం రోడ్డు, శ్రీనివాస నగర్, విశాఖపట్నం.

పై నెంబరు పిటిషన్లో రెస్పాడెంట్/ప్రతివాదికి పలుమార్లు కోర్టు నోటీసులు జారీ చేసినప్పటికీ, అందుకోనందున, ఆమెకు ఎట్టి అభ్యంతరములు ఉన్న యెడల **తే 25-03-2025 దిన ఉదయం 10:30 ని.లకు** సదరు పై కోర్టులో వ్యక్తిగతంగా గాని, ప్లీడర్ గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలియజేసుకొనవచ్చును, లేని యెడలా పరోక్షములో తీర్పు యిచ్చెదరని యిందుమూలంగా తెలియ చేయడమైనది.

G.CHITTIBABU
Advocate
S.Kota
Srungavarapukota
Dt: 18-03-2025

మహారాజశ్రీ శృంగవరపుకోట జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.136/2024

Between:
కుంద్రపు అప్పలరాజు ......వాది
And:
విన్నకోట శ్రీనివాస దుర్గ ....ప్రతివాది

ప్రతివాది :
విన్నకోట శ్రీనివాస దుర్గ W/o నాగేశ్వరరావు, డోర్ నెం.21-185, సాయి హాసిని ఎన్ క్లేవ్స్ ఎదురుగా, సింహాచలం రోడ్డు, శ్రీనివాస నగర్, విశాఖపట్నం.

పై నెంబరు దావాలో ప్రతివాదికి పలుమార్లు కోర్టు సమన్లు జారీ చేసినప్పటికీ, అందుకోనందున, ఆమెకు ఎట్టి అభ్యంతరములు ఉన్న యెడల **తే 25-03-2025 దిన ఉదయం 10:30 ని.లకు** సదరు పై కోర్టులో వ్యక్తిగతంగా గాని, ప్లీడర్ గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలియజేసుకొనవచ్చును. లేని యెడలా పరోక్షములో తీర్పు యిచ్చెదరని యిందుమూలంగా తెలియ చేయడమైనది.

G.CHITTIBABU
Advocate
S.Kota
Srungavarapukota
Dt: 18-03-2025

మహారాజశ్రీ VII వ అదనపు జిల్లా జడ్జి మరియు ఫ్యామిలి కోర్టు : ఏలూరు
FCOP.199/2024

గుళ్లపల్లి @ యాండ్రపు చైతన్య ...పిటీషనర్
మరియు
యాండ్రపు జగదీష్ ...రెస్పాండెంట్

పై నెంబరు FCOP.199/2024లో పిటీషనర్ గుళ్లపల్లి @ యాండ్రపు చైతన్య రెస్పాండెంట్ అయిన యాండ్రపు జగదీష్ పై డైవర్స్ కోరుతూ కోర్టులో పిటీషన్ దాఖలు చేసియున్నారు. దీనిపై రెస్పాండెంట్ అయిన యాండ్రపు జగదీష్, S/o.లేటు సత్యనారాయణ, వయస్సు 44 సం॥లు, R/o.D.No.14-3-18/4, మహారాణిపేట, విశాఖపట్నం, విశాఖపట్నం జిల్లా. అను వారికి ఏవిధమైన అభ్యంతరాలు ఉన్న యెడల తేది. **7-4-2025న ఉదయం 10 గం॥ 30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట ఆక్షేపణలు తెలియచేయవలెను. లేనియెడల మీకు పరోక్షముగా తీర్మానించబడును.

అంబుల వెంకట నారాయణ
దాసరి జిజియాబాయి
ఏలూరు న్యాయవాదులు, ఏలూరు.
ది.19-3-2025 సెల్: 9440388689

గ్రామ పంచాయితీ కార్యాలయం - తాటితూరు

రేఖా నెం. 12/2025 టెండరు ప్రకటన తేదీ.15-03-2025

విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం మండలం, తాటితూరు గ్రామపంచాయితీ నందు, దిగువ షెడ్యూలు నందుదహరించిన పనులను 2025-26 సం.నకు కాంట్రాక్టు పద్ధతిపై చేయుటకు పనివార్ని సప్లయి చేయుటకు తే: 25-03-2025దిన మధ్యాహ్నం గం. 12.00 గంటల వరకు తాటితూరు గ్రామ సచివాలయం నందు ఈ దిగువ సంతకం దారునిచే గానీ, వారి అనుమతి పొందిన యితర ఉద్యోగిచే గానీ, సీలు వేసిన టెండర్లు స్వీకరించబడును. స్వీకరించబడిన టెండర్లు అదేరోజు మధ్యాహ్నం గం.3.00 లకు అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షములో తెరువబడును. టెండర్లలో పాల్గొనదలచిన వారు టెండరు ధరవత్తు చెల్లించి, టెండరు షరతులకు లోబడి టెండర్లలో పాల్గొనవలెను.

షెడ్యూల్

క్ర నెం	పని వివరములు	పనివారి సంఖ్య	ధరావత్తు రూ.
1	పారిశుధ్య పనులు	05	10,000/-
2.	వీధిలైట్లు నిర్వహణ & బిగింపు పనులు	02	
3.	మంచినీటి పంపు ఆపరేటింగ్ నిర్వహణ పనులు	02	
4.	మంచినీటి పైపు లైన్లు నిర్వహణ (ప్లంబర్) పనులు	01	

గమనిక : (1) పై పనుల యొక్క టెండర్లు శ్రీ జిల్లా కలెక్టర్ (పం.వి.), విశాఖపట్నం వారి అనుమతికి లోబడి ఖరారు చేయుట మరియు కాంట్రాక్టు పనులకు చెల్లింపులు చేయుట జరుగును. **(2)** టెండర్లు ఎట్టి కారణం చూపి గానీ చూపకుండా గానీ, రద్దు పరుచుటకు, వాయిదా వేయుటకు, తిరస్కరించుటకు గ్రామపంచాయితీకి పూర్తి అధికారము గలదు. **(3)** పూర్తి షరతులు, యితర వివరములు కార్యాలయ పనివేళలందు పంచాయితీ కార్యదర్శి వారిని సంప్రదించి తెలుసుకొనగలరు.

సం/- ఎస్.కె.సి.వి.ప్రసాద్
పంచాయితీ కార్యదర్శి,
గ్రామపంచాయితీ, తాటితూరు,
భీమునిపట్నం మండలం

సం/- సిరిగిడి సంతోషి
సర్పంచ్,
గ్రామపంచాయితీ, తాటితూరు,
భీమునిపట్నం మండలం.

తీర ప్రాంతంలో క్షేత్ర స్థాయి పరిశీలన

ప్రజాశక్తి -భీమునిపట్నం : సిఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి తీర ప్రాంతంలో నిర్మించిన కట్టడాలను జివిఎంసి, రెవెన్యూ అధికారులు మంగళవారం క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. స్థానిక బీచ్ రోడ్డులో సిఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టారని ఆరోపిస్తూ జివిఎంసి 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, జివిఎంసి మూడో వార్డు ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు గంటా నూకరాజు హైకోర్టులో కేసు దాఖలు చేసిన విషయం విధితమే. ఇందుకు సంబంధించి కోర్టు ఆదేశాల మేరకు బీచ్ రోడ్డులో ఉన్న సీ హార్స్ రెస్టోబార్ (బి జాగ్), తీరం బీచ్ రిసార్ట్స్, సాంటమ్ బార్ అండ్ రెస్టారెంట్, విరాగో రెస్టో బార్ ఉన్న ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. నియమించిన కమిటీలో కన్వీనర్‌గా ఉన్న జివిఎంసి అదనపు కమిషనర్ (ఫైనాన్స్) ఎస్ఎస్.వర్మ, సభ్యులు భీమిలి ఆర్‌డిఒ సంగీత్‌మాధుర్, సిఎస్ఐఆర్ చీఫ్ సైంటిస్ట్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషియోనోగ్రఫీ డాక్టర్ వివిఎస్ఎస్.శర్మ, ఎపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సీనియర్ ఎన్విరాన్ మెంటల్ ఇంజినీర్ పివిబిఎల్‌జి శాస్త్రి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వీరితో పాటు జివిఎంసి ఒకటో జోన్ జెడ్‌సి పిల్లి ప్రేమ ప్రసన్నవాణి, టౌన్ ప్లానింగ్ ఎసిపి రామకృష్ణ పాల్గొన్నారు. సమగ్ర నివేదికను రూపొందించి కోర్టుకు సమర్పిస్తామని కమిటీ కన్వీనర్, సభ్యులు తెలిపారు. 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, ఎగువ పేట గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు గంటా నూకరాజు కూడా పాల్గొన్నారు. వీరిద్దరూ మరిన్ని వివరాలను కమిటీ సభ్యుల ముందుంచారు.

బీచ్ రోడ్డులో పరిశీలిస్తున్న జివిఎంసి అదనపు కమిషనర్, ఆర్‌డిఒ

నేడు వేములవలస మార్కెట్‌కు వేలం

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం వేములవలస మహాత్మాగాంధీ డైలీ మార్కెట్ వేలం పాట బుధవారం ఉదయం 10 గంటలకు వేములవలస పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ నాయుడు తెలిపారు. సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం పాట నిర్వహించబడునని, పాట దారులు పాల్గొవాలని కోరారు.

కళాకారులకు సంక్షేమ పథకాలు అమలుచేయాలి

ప్రజాశక్తి -తగరపువలస : జానపద కళాకారులకు సంక్షేమ పథకాలు అమలుచేయాలని నవ చైతన్య కళా నాట్య సంక్షేమ సంఘం నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక సంఘం కార్యాలయంలో మంగళవారం ఉత్తరాంధ్ర జిల్లాల కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల గౌరవ సలహాదారు కొణతాల రాజు, కార్యదర్శి సరగడ చిన్నరెడ్డి మాట్లాడుతూ, అర్హులైన కళాకారులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు, పింఛన్లు, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల కమిటీ అధ్యక్షులు పిల్లి వీర్రాజు, ఉపాధ్యక్షులు ఎ.లక్ష్మన్నాయుడు, సహాయ కార్యదర్శి ఎస్.రవికుమార్, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల కమిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. నవ చైతన్య కళా నాట్య సంక్షేమ సంఘం 22వ వార్షికోత్సవం ఏప్రిల్‌లో విశాఖ నగరంలో నిర్వహించాలని కమిటీ నిర్ణయించినట్లు వారు తెలిపారు.

మినీ వ్యాన్ స్టాండ్ ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక శివాలయం ఎదురుగా మినీ వ్యాన్ల ట్రాన్స్ పోర్ట్ స్టాండ్‌ను సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం ప్రారంభించారు. యూనియన్ జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి స్టాండ్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఐక్యంగా ఉంటేనే హక్కులను సాధించు కోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.అప్పలనాయుడు, స్టాండ్ నూతన కమిటీ అధ్యక్షులు ఎస్.వెంకటసత్యం, ప్రధాన కార్యదర్శి వై.సూరిబాబు, కోశాధికారి ఎ.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మినీ వ్యాన్స్ ట్రాన్స్ పోర్ట్ స్టాండ్‌ను ప్రారంభిస్తున్న మూర్తి

క్షయ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ర్యాలీ చేస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది

ప్రజాశక్తి - ఆరిలోవ : క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో ఉండాలని, వ్యాధి పట్ల అవగాహన పెంచుకోవాలని ఆరిలోవ బాలాజీనగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్, తోటగురువు యుపిహెచ్‌సి ఇన్‌ఛార్జి డాక్టర్ కిరణ్ లలిత సూచించారు. ఈ నెల 24వ తేదీన ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా ఆరిలోవ ఎఫ్ఆర్‌యు టిబి యూనిట్ ఆధ్వర్యాన క్షయ దినోత్సవ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఆరిలోవ లాస్ట్ బస్ స్టాప్ నుంచి దుర్గాబజార్ వరకు ఎఫ్ఆర్‌యు టీబీ యూనిట్ సిబ్బంది, బాలాజీ నగర్, తోటగురువు యుపిహెచ్‌సి ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. రెండు వారాల పైబడి దగ్గు, జ్వరం ఉంటే అది టీబీ కావొచ్చు, అప్రమత్తంగా ఉంటూ వైద్య పరీక్ష చేయుంచుకోండి అంటూ, టీబీ పరీక్షలు ఉచితమే, అప్రమత్తతో టీబీ ఓడుతుంది, దేశం గెలుస్తుంది' అంటూ నినాదాలు చేశారు. అనంతరం డాక్టర్ కిరణ్ లలిత మాట్లాడుతూ, క్షయ వ్యాధి నిర్మూలనకు ముందస్తు జాగ్రత్త మార్గమన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉంటే ఆరోగ్య కేంద్రానికి గానీ, టీబీ యూనిట్‌కు గానీ వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ పరీక్షలు ఉచితంగానే చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, సీనియర్ టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ వేములయ్య, టీబీ హెల్త్ విజిటర్ లక్ష్మి పాల్గొన్నారు.

ఇంటి ఖాళీ స్థలంలో చెత్త

పట్టించుకోని యజమాని, జివిఎంసి శానిటరీ విభాగం

ఇబ్బందులు పడుతున్న స్థానికులు

ప్రజాశక్తి - ఆరిలోవ : స్థలాన్ని కొని ఎటువంటి నిర్మాణం చేపట్టకుండా ఖాళీగా ఏళ్ల తరబడి వదిలేయడంతో అది చెత్తతో నిండిపోయింది. ఆ స్థలాన్ని చుట్టు పక్కల ప్రజలు డంపింగ్ యార్డులా వాడుకుంటున్నారు. గుట్టలు గుట్టలుగా చెత్త పేరుకుపోవడంతో పరిసర ప్రాంతాలు కంపుకొడుతున్నాయి. దీనిపై స్థల యజమాని, జివిఎంసి, సచివాలయ సిబ్బంది దృష్టికి పలువురు తీసుకెళ్లినా పట్టించుకోక పోవడంతో నివాసదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 12వ వార్డు శ్రీలీలా సుందరయ్యనగర్, సాయిబాబా ఆలయం రోడ్డులో సుమారు 20 ఏళ్ల క్రితం సుమారు 30 గజాల స్థలాన్ని ఒక ఆసామి కొనుక్కున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ స్థలంలో ఎటువంటి నిర్మాణం చేపట్టలేదు. ఈ స్థలంలో చుట్టుపక్కల వాళ్లు చెత్తతో పాటు పాత భవనం శిథిలాలు, మట్టి వేయడంతో డంపింగ్ యార్డులా తయారైంది. ఈ స్థలానికి ఆనుకొని ఉన్న నివాసాల్లో చెమ్మ, చెదలు పడుతున్నాయి. దోమలు, ఈగలు ప్రబలుతున్నాయి. దీని వల్ల ఎక్కడ ఆనారోగ్యం పాలవుతామోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై దూర ప్రాంతంలో ఉన్న స్థల యజమానికి సమాచారం ఇచ్చినా పట్టించుకోవడంలేదని సచివాలయ శానిటరీ విభాగం సిబ్బంది చేతులెత్తేశారు. ఇప్పటికైనా జివిఎంసి అధికారులు స్పందించి స్థల యజమానిపై చర్యలు తీసుకోవాలని, ఇక్కడ నుంచి చెత్త, పేరుకు పోయిన మట్టిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంటి ఖాళీ స్థలంలో పేరుకు పోయిన చెత్త, భవన శిథిలాలు

వైసిపి మండల అధ్యక్షునిగా లక్ష్మణరావు

ప్రజాశక్తి -పద్మనాభం : వైసిపి మండల అధ్యక్షునిగా కోరాడ లక్ష్మణరావు మరోసారి ఎన్నికయ్యారు. వైసిపి భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యాన మంగళవారం పద్మనాభం మండలం వైసిపి కార్యాలయంలో ఎన్నిక జరిగింది. నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవంగా ఆమోదించడంతో మండల అధ్యక్షునిగా కోరాడ లక్ష్మణరావు ఎన్నికైనట్లు మజ్జి శ్రీనివాసరావు ప్రకటించారు. ఈ సందర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ, పార్టీ ఆదేశాల మేరకు మండల కార్యవర్గాలు ఎన్నికైన తర్వాత నియోజకవర్గ కమిటీలకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.

ప్రతి గ్రామం నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలను చిన్న శ్రీను పరిచయం చేసుకున్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ కష్టం వచ్చినా మీ వెంట నేనుంటానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి అందరూ కృషిచేయాలని కోరారు.

కూటమి ప్రభుత్వం వచ్చి సుమారు పది నెలలైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని విమర్శించారు. వైసిపిని ఓడించేందుకు అమలు కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.రాంబాబు, జడ్పీ వైస్ చైర్మన్ ఎస్.గిరిబాబు పాల్గొన్నారు.

మైండ్‌ఫుల్‌నెస్ ద్వారా ఒత్తిళ్లు దూరం

- గీతంలో స్టాన్‌ఫర్డ్ నిపుణుడు ఎడ్వర్డ్

ప్రజాశక్తి-మధురవాడ : మైండ్‌ఫుల్‌నెస్ అనేది ఆలోచనలను నియంత్రించుకోవడమే కాకుండా ఒత్తిడులను తగ్గించుకోవడానికి, ఏకాగ్రతను పెంచుకోవడానికి శక్తివంతమైన సాధనం అని స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నిరంతర విద్యావిభాగం శిక్షకుడు, 'ప్లేఫుల్‌మైండ్‌ఫుల్‌నెస్' గ్రంథరచయిత ఎడ్వర్డ్ రెనెడెస్‌విసర్స్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన దైనందిన జీవితంలో మైండ్ ఫుల్‌నెస్ విధానాలు అనుసరణపై విద్యార్థులకు, అధ్యాపకులకు శిక్షణ అందించారు. శ్వాసక్రియలను, స్వల్పకాలికంగా మనస్సును ఏకాగ్రతలో ఉంచడం ద్వారా ఒత్తిడులు దూరమై సంపూర్ణ చైతన్యంతో తిరిగి విధులకు హాజరు కావచ్చని తెలిపారు. చిన్న చిన్న క్రీడలతో మానసిక ఉల్లాసం, ఏకాగ్రతను ఎలా పెంచుకోవచ్చో వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా దీనిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు, జిమ్‌సర్ డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు, గీతం విద్యార్థి విభాగం డీన్ డాక్టర్ బాలాకుమార్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులకు కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి-ఆనందపురం : ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యాన వేములవలస కూడలి కెఎస్ఆర్ హోటల్‌లో గొంతు, ప్రోస్టేట్ కేన్సర్లకు సంభవించే పరిస్థితులను ఆర్ఎంపిలకు హెచ్‌సిజి కేన్సర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ విఎన్.శరత్‌చందు, డాక్టర్ కె.ఫణిశేఖర్ వివరించారు. 60 ఏళ్లు పైబడిన మగ వారికి తరచూ మూత్ర విసర్జనలో మంట, తక్కువ విసర్జన, నొప్పి ఉంటే తనిఖీ చేయించాలని తెలిపారు. డాక్టర్ ఫణిశేఖర్ స్త్రీల వక్షోజాలలో గడ్డలు కనిపించినా, 40 ఏళ్ల పైబడిన వారికి తరచు రక్త శ్రావం జరిగినా డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. వీటి పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని గ్రామీణ వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల వ్యవస్థాపక అధ్యక్షులు జంగం జోషి, విశాఖ జిల్లా అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు, రిటైర్డ్ పారామెడికల్ ఆఫీసర్ నరేంద్ర కుమార్, స్థానిక ఆర్ఎంపి నాయకులు సుధాకర్‌రెడ్డి, కెఎన్.రావు, కనకారావు, కోటేశ్వరరావు, రఘు, వినోద్, జగదీష్, రాలి అప్పారావు, పోరాడ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రోగులకు కెజిహెచ్‌లో..

ఆకలి కష్టాలు లేకుండా చూడాలి

- జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో చికిత్స కోసం వచ్చిన గిరిజన రోగులు,వారి సహాయకులకు భోజనం, అల్పాహారం సరఫరాలో ఎటువంటి లోటు లేకుండా, ఆకలి కష్టాలు రాకుండా జాగ్రత్త పడాలని జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర కోరారు. కెజిహెచ్‌లో గిరిజనులకు ఆకలి కష్టాలపై పత్రికల్లో వచ్చిన కథనాలపై స్పందించి మంగళవారం కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద కు లేఖ రాశారు. దీనికి ప్రతిస్పందించిన డాక్టర్ శివానంద, దీనిపై తక్షణ చర్యలకు ఆసుపత్రిలోని అంతర్గత సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. నిర్లక్ష్యంచేస్తే. కెజిహెచ్ డైటీషియన్, నర్సింగ్ విభాగం పూర్తి బాధ్యులు అవుతారని, గిరిజనులకు భోజన సదుపాయం అందించే బాధ్యత పూర్తిగా రోజువారి ఇండెంట్ ఇచ్చే నర్సింగ్ విభాగానిదేనన్నారు.

నూతన కార్యవర్గ సభ్యులు

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- గోపాలపట్నం : జివిఎంసి 90వ వార్డు పరిధి కాకానినగర్, విమాననగర్, కనకమహాలక్ష్మి నగర్, వినోద్ నగర్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఎలమంచిలి సత్యనారాయణ, ఉపాధ్యక్షునిగా ఆర్.జగదీష్, కార్యదర్శిగా జె.అచ్చిబాబు, సంయుక్త కార్యదర్శిగా కెఎస్.రాజు, కోశాధికారిగా ఎస్.వి.కృష్ణ, సభ్యులుగా ప్రసాద్, నారాయణ, మూర్తి, అప్పారావును ఎన్నుకున్నారు.

వికలాంగ పిల్లలను ముందంజలో ఉంచాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : వికలాంగ పిల్లలను, మానసిక, సామాజికాభివృద్ధిలో ముందంజలో ఉంచాలన్న ప్రభుత్వాల లక్ష్యాలను మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ సిఫారసులు చేయనున్నట్టు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో గల ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రం భవితను ఆయన మంగళవారం సందర్శించారు. సిబ్బంది, అధికారులు, పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ప్రత్యేక బోధనా విధానాలతో తర్ఫీదు పొందిన ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారు, పిల్లలకు బ్రెయిలీ లిపి, సంజ్ఞా భాష, స్పీచ్ థెరపీ వంటి ప్రత్యేక విద్యా విధానాలు ఎలా అమలు చేస్తున్నారని సర్వ శిక్ష అభియాన్ ఎపిసి జె.చంద్రశేఖర్, జిల్లా ఐఇ కో-ఆర్డినేటర్ బి.గీతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సర్వ శిక్ష అభియాన్ జిల్లా అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ జె.చంద్రశేఖర్ మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న భవిత కేంద్రాల్లోని సమస్యలను తమ పరిధిలో సాధ్యమైనంత వరకు పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమణ కుమారి, ఎంఇఒలు రామారావు, బాల మణి, జివిఎంసి బాల్యం ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ఎ.మోహన్‌కుమార్, మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనరస తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుల కబ్జాను పరిశీలించిన జనసేన

ప్రజాశక్తి-పెందుర్తి : వైసిపి హయాంలో మండలంలోని కోటనరవ, గవర జగ్గయ్యపాలెంలో జరిగిన కబ్జా ప్రాంతాలను జనసేన నాయకులు గల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యాన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, గవర జగ్గయ్యపాలెం సర్వే నంబర్ 460లో సుమారు రెండెకరాలు కబ్జా జరిగిందని, అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. కోటనరవ ప్రాంతంలో ల్యాండ్ కన్వర్షన్ చేయకుండా ప్లాన్ అప్రూవల్ తెచ్చి నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. పేదలకు ఇచ్చిన మంగళ మాన్యాలను నాయకులు తప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకొని, ప్లాన్ అప్రూవల్ తీసుకోకుండా భవనాలు నిర్మిస్తున్నారని ఆరోపించారు. గెడ్డ పక్కన కొంత జిరాయితీ, మరికొంత బంజరు కలుపుకొని అపార్ట్‌మెంట్ నిర్మించారని తెలిపారు. జెర్రిపోతులపాలెం సర్వే నెంబర్ 420లోని చెరువులో అక్రమ క్వారీలు కొనసాగుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బదిరెడ్డి శివ, రేవళ్ల ముత్య అర్జున్, పాలమరశెట్టి భాను, ముత్త గోపి, వాసు, బాలు, టిడిపి నాయకులు పాలమరశెట్టి బుల్‌రాజు, ముత్తా సత్తిబాబు, మురళి, నాగేష్ పాల్గొన్నారు.

కబ్జా భూములను పరిశీలిస్తున్న జనసేన నాయకులు

కల్యాణ మండపం నిర్మాణం జరిగేనా?

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 69వ వార్డు పరిధి తుంగ్లం గ్రామంలో కల్యాణ మండపం నిర్మాణానికి గ్రహణం వీడేటట్లు కనిపించడం లేదు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో సార్వత్రిక ఎన్నికలకు రెండు నెలలు ముందు రూ.50 లక్షల ఖర్చుతో కల్యాణ మండపం నిర్మాణానికి టెండర్లు పిలిచారు. ఎన్నికల కోడ్ వస్తుందని చెప్పి హడావుడిగా అప్పటి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈలోగా ఎన్నికలు వచ్చాయి. తర్వాత తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎమ్మెల్యేగా పల్లా శ్రీనివాసరావు గెలిచారు. తుంగ్లాంలో టిడిపికి చెందిన కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డిని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పక్కన పెట్టినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. టిడిపి చెందిన మరో నాయకునికి ఎమ్మెల్యే అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కల్యాణ మండపం నిర్మాణానికి రాజకీయ రంగు పులుముకుందని స్థానికుల్లో చర్చ నడుస్తోంది. కల్యాణ మండపం నిర్మాణం కాకుండా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అడ్డుతగులుతున్నారని తెలుగుశక్తి అధ్యక్షులు బివి.రామ్ కొంతకాలం క్రితం పెట్టిన ప్రెస్‌మీట్‌లో ఆరోపించారు. అభివృద్ధికి సహకరించాలి తప్ప పనులు జరగకుండా అడ్డుకోకూడదని ఆయన అప్పట్లో చెప్పారు.

కల్యాణ మండపం నిర్మాణానికి గోతులు తీసి విడిచిపెట్టేశారు. నిర్మాణం జరిగితే శుభకార్యాలు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని స్థానికులు ఎదురుచూస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేయలేక మౌనం దాలుస్తున్నారు. ఏం జరుగుతుందో వేచి చూడాలి మరి.

పనులు మధ్యలో నిలిచిపోవడంతో గుంతలో చేరిన నీరు

కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి

నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

ప్రజాశక్తి- కరాస: కనీస పెన్షన్ రూ.9000 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి 52వ వార్డు పరిధి మర్రిపాలెం రీజనల్ పిఎఫ్ ఆఫీస్ సమీపంలోని బస్టాప్ వద్ద పెన్షనర్లు నిరసన తెలిపారు. ఇపిఎస్ -95 పెన్షనర్ల ఆలిండియా కో-ఆర్డినేషన్ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు, ఎపిఆర్‌పిఎ పెన్షనర్లు చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో ఎపిఆర్‌పిఎ రాష్ట్ర కార్యదర్శి సుధాకరరావు మాట్లాడుతూ, పెరిగిన నిత్యవసరాల ధరలకు అనుగుణంగా కనీస పెన్షన్ రూ.9000 ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పును వక్రీకరించకుండా అర్హులందరికీ హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని, భార్యాభర్తలకు మెడికల్ సదుపాయం కల్పించాలని, సీనియర్ సిటిజన్స్‌కు రైలు ప్రయాణ రాయితీలు పునరుద్ధరించాలని డిమాండ్‌చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి హుస్సేన్ మాట్లాడుతూ, ప్రభుత్వం పెద్ద పెట్టుబడిదారుల సేవలో నిమగ్నమై, తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. తమ నిల్వ పెన్షన్ ఫండ్‌తో కూడా పెన్షన్ పెంచకుండా, కమిటీల మీద కమిటీలు వేసి కాలయాపన చేస్తోందని ధ్వజమెత్తారు. అనంతరం పిఎఫ్ ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లి అసిస్టెంట్ రీజనల్ పిఎఫ్ కమిషనర్ జాస్తి పవన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ వెంకటేశ్వరరావు, ఎం.కృష్ణారావు, కాళేశ్వరరావు, తులసీరాం, మూర్తి, కోటేశ్వరరావు, నాగభూషణం, భాస్కరరావు, ఆర్.బాబూరావు, హుస్సేన్, కె.అప్పలరాజు, జె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బిసి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- ఆనందపురం : బిసి కార్పొరేషన్ ద్వారా రుణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆనందపురం ఎంపిడిఒ డాక్టర్ వి .జానకి పేర్కొన్నారు. బిసి కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కల్పనలో భాగంగా అర్హత కల్గిన లబ్ధిదారులకు చంద్రన్న స్వయం ఉపాధి పథకం-2025లో ఆర్థిక సహాయం కల్పించుటకు 'ఆన్-లైన్ (ఎపిఒబిఎంఎంఎస్) ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 50 శాతం సబ్సిడీ, 50 శాతం బ్యాంకు రుణంగా ఆర్థిక సహాయం ఉంటుందని వివరించారు. అర్హత కలిగిన లబ్ధిదారులు స్వయం ఉపాధి రంగాలలో అర్హత మేరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 22వ తేదీ లోపు ఆయా సచివాలయాలలో దరఖాస్తులు అందించాలని పేర్కొన్నారు.

జగన్మోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న కెకె.రాజు

జగన్మోహన్‌రెడ్డిని కలిసిన కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని విజయవాడలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుత రాజకీయాలపై కొంతసమయం చర్చించినట్లు కెకె.రాజు తెలిపారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉండాలని జగన్మోహన్‌రెడ్డి సూచించినట్లు పేర్కొన్నారు.

న్యాయవాద సంఘం ఎన్నికలకు 45 నామినేషన్లు

ప్రజాశక్తి-లీగల్ : విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో అన్ని పదవులకు కలిపి 45 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది జిఎం.రెడ్డి తెలిపారు. ఇందులో అధ్యక్ష పదవికి ఎంకె.శ్రీనివాస్, ఐఎం.మహమ్మద్, ఎన్.సన్యాసిరావు, ఉపాధ్యక్ష పదవికి కె.విజయబాబు, సిహెచ్.ఆనంద్‌కుమార్, పి.మీనాక్షి, ఎన్‌టిపి.గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శికి ఎవి.సోమేశ్వరరావు, ఆర్.సూర్యనారాయణ, వివి.సుధాకర్, ఎల్‌పి.నాయుడు, జాయింట్ సెక్రటరీకి పిఎన్ఎస్ఎస్.కుమార్‌రాజు, పి.భవాని, డి.వెంకటశ్రీధర్, కోశాధికారికి జయ శివప్రసాద్, ఎ.దివ్యకుమార్, బోసుబాబు, టి.రాము, వైవిఎల్ఎన్.రావు, లైబ్రరీ సెక్రెటరీకి నలుగురు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీకి ముగ్గురు, లేడీస్ రిప్రజెంటీ పోస్ట్‌కు ముగ్గురు, సీనియర్ ఎగ్జిక్యూటివ్ 30 ఏళ్ల పైబడి అనుభవం ఉన్న పోస్టుకు ఇద్దరు, 20 ఏళ్ల సీనియార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌కు ఎ.అప్పారావు, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ 10 ఏళ్ల పైబడిన పోస్టుకు దేవి, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఆరుగురికి 14 మంది న్యాయవాదులు నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల అధికారి తెలిపారు. 19వ తేదీన స్క్రూట్నీ, 20న ఉపసంహరణ అనంతరం 21న ఎన్నికల్లో ఉన్న వారి జాబితాలను పెట్టనున్నట్లు పేర్కొన్నారు.

కోరమాండల్‌లో సైన్స్ ఫెయిర్

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 58వ వార్డు పరిధిలోని కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యాన సంస్థ ఆవరణలో ఏర్పాటుచేసిన 'కోరమాండల్ ప్రయాగ ఉత్సవ్' కార్యక్రమం ద్వారా సైయన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో 26 పాఠశాలలు పాల్గొన్నాయి. 146 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జివిఎంసి అడిషనల్ కమిషనర్ డాక్టర్ వి.రమణమూర్తి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు సైన్స్ ఫెయిర్‌ను కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ములగాడ తహశీల్దార్ ఎం.భుజంగారావు, జోనల్ కమిషనర్ బి.రాము, కోరమాండల్ సంస్థ మ్యానుఫ్యాక్చర్ ప్రెసిడెంట్ ఎం.జ్ఞానసుందరం, హెచ్ఆర్ డిజిఎం రెడ్డిపల్లి శ్రీనివాసరావు, ప్రధాన భద్రత అధికారి నారాయణ పాత్రుడు, హెచ్ఆర్ సీనియర్ మేనేజర్ కె.శ్రీకాంత్, సిఎస్ఆర్ డిప్యూటీ మేనేజర్ వెంకటరమణ పాల్గొన్నారు.

సైన్స్ ప్రదర్శనలను తిలకిస్తున్న అధికారులు

మాస్టర్ ప్లాన్ రోడ్ల పరిశీలన

ప్రజాశక్తి -మధురవాడ : జోన్ -2 పరిధిలో ఉన్న మాస్టర్ ప్లాన్ రహదారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్, జివిఎంసి సిసిపి ప్రభాకర్, డిసిపి.హరినాథ్, విఎంఆర్‌డిఎ ప్లానింగ్ అధికారి కూన వెంకటేశ్వరరావు, ఎసిపి తిరుపతిరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హరిత, నగరంపాలెం రోడ్డు, శివశక్తినగర్ రోడ్డు, రేవళ్లపాలెం రోడ్డు, మాస్టర్ ప్లాన్ రోడ్లు, టిడిఆర్ వివరాలను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ, మాస్టర్ ప్లాన్ రహదారుల టిడిఆర్ త్వరగా పూర్తి చేయడంతో పాటు రహదారి పనులు వేగవంతం చేసేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు మొల్లి లక్ష్మణరావు, వాండ్రాశి అప్పలరాజు పాల్గొన్నారు.

నేర పరిశోధనపై అవగాహన పెంచుకోవాలి

విశాఖ పోలీస్ కమిషనరేట్ లీగల్ అడ్వైజర్ రామకృష్ణారావు

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రామకృష్ణారావు తదితరులు

ప్రజాశక్తి-సబ్బవరం

నేర పరిశోధనపై న్యాయ విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని విశాఖ పోలీస్ కమిషనరేట్ లీగల్ అడ్వైజర్ రామకృష్ణారావు సూచించారు. స్థానిక దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్శిటీ క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ ఆరవ జాతీయ స్థాయి పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామకృష్ణారావు మాట్లాడుతూ విచారణ దశలో నేరం జరిగిన ప్రదేశం, అక్కడ ఆధారాలు సేకరించడం ఎంతో ప్రాధాన్యత కలిగి ఉందని, ప్రతి చిన్న ఆధారం కూడా ఎంతో విలువైనదని పేర్కొన్నారు. రకరకాల నేరాలు వెలుగులోకి వస్తున్నాయని, అందుకు అనుగుణంగా తగిన సాంకేతిక అంశాల మీద న్యాయ విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. నేర పరిశోధనలోని చిక్కుముడులపై మాట్లాడుతూ ప్రతి న్యాయవాది కేసు వాదనకు తీసుకునే సమయంలో ఒక పోలీస్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తూ ఆధారాలను సేకరించవలసి ఉండుందని తెలిపారు. న్యాయ విద్యార్థులకు అవసరమైన ఆచరణాత్మక అనుభవాన్ని పెంపొందించుకునే ఇలాంటి పోటీలు నిర్వహించాలన్నారు. పరవాడ డిఎస్‌పి విష్ణు స్వరూప్ మాట్లాడుతూ దర్యాప్తు అధికారులుగా పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లను తెలియజేశారు. ఒక కేసులో న్యాయం జరగాలంటే ఆ కేసులో వాస్తవాలు, సాక్ష్యాలను కనుగొనడం అనేది చాల కీలకమని చెప్పారు. సరైన సాక్ష్యం సేకరించలేకపోవడం అన్యాయానికి దారితీస్తుందన్నారు. న్యాయవాద వృత్తిలో ప్రవేశించబోయే విద్యార్థుల నిశిత పరిశీలన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ నేరం జరిగిన ప్రాంతంలో ఆధారాలను ఎలా సేకరించాలో అనే అంశం మీద ఈ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నందిని, డాక్టర్ సిహెచ్.లక్ష్మి, డాక్టర్ రిఫాత్ ఖాన్, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వ చందర్‌నాథ్, న్యాయ విద్యార్థులు పాల్గొన్నారు.

31లోగా ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని రేషన్ కార్డు లబ్దిదారులందరూ ఈ నెల 31లోగా ఈకెవైసి చేసుకోవాలని స్థానిక తహసీల్దార్ బి.చిన్నికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ కార్డులో కుటుంబ సభ్యులందరూ ఐదేళ్ల పైబడిన, 60 సంవత్సరాల లోపు వయస్సు గల వారు ఈ నెల 31లోపు తప్పనిసరిగా గ్రామ సమీపంలో గల చౌకధరల దుకాణం డీలర్ వద్దకు వెళ్లి ఆధార్ ఈకెవైసి చేయించుకోవాలని కోరారు. ఈకెవైసి పెండింగ్ జాబితా ఆయా గ్రామ చౌక ధరల దుకాణం డీలర్ వద్ద అందుబాటులో ఉంటుందని, ఈకెవైసి నిర్ణీత సమయంలో పూర్తి చేసుకున్న యెడల సదరు కార్డుదారులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయబడుతుందని చెప్పారు. ఈకెవైసి పూర్తి చేసుకోలేని కార్డుదారులకు ఏప్రిల్ ఒకటో తేది నుండి నిత్యవసర సరుకులు నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని పెండింగ్ ఈకెవైసి ఉన్న కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పైడిమాంబ ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-పరవాడ : మండల కేంద్రం పరవాడ శ్రీపైడిమాంబ ఆలయం పునర్నిర్మాణానికి కావాల్సిన స్థల సేకరణకు పరవాడ గ్రామానికి చెందిన పైల సత్యనారాయణ (షిప్‌యార్డ్) కుమారుడు పైలా ప్రసాద్ రూ.2 లక్షల చెక్‌ను పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడుకు మంగళవారం అందచేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు చుక్క రామునాయుడు, పరవాడ ఉప సర్పంచ్ బండారు రామారావు, పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, టిడిపి అధికార ప్రతినిధి పైల రామచంద్రరావు, పైల అప్పలనాయుడు, చీపురుపల్లి సన్యాసిరావు, పైల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-కశింకోట : మండలంలో కొత్తపల్లి, తేగాడ గ్రామాలలో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.స్వప్న వరి, నువ్వు పంటలను పరిశీలించారు. వరిలో ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కాండం తొలిచే పురుగు ఆశించే అవకాశం ఉన్నందున, నివారణకు కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 4జి, 8కె జి ఎకరాకు 20కేజీల ఇసుకలో కలిపి పొలమంతా సమానంగా చల్లుకోవాలని సూచించారు. రైతులంతా భూ ఆధార్ నమోదు చేసుకోవాలన్నారు. దీని వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఈఓ ఎ.నూక శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

పొలంలో నువ్వు పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

చట్టాలపై అవగాహన కల్పించుకోవాలి

ఎలమంచిలి సివిల్ కోర్టు జడ్జి పి.విజయ

సివిల్ కోర్టు జడ్జి విజయను జ్ఞాపికతో సత్కరిస్తున్న శేషగిరిరావు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మహిళలకు రూపొందించిన చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని ఎలమంచిలి సివిల్ కోర్టు జడ్జి పి.విజయ అన్నారు. అచ్యుతాపురంలోని అచ్యుతా డిగ్రీ కళాశాల ఆవరణలో పోక్సో చట్టంపై స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ వారి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి విజయ మాట్లాడుతూ మహిళల కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన లేక అన్యాయం జరిగినప్పటికీ ఎవరికీ చెప్పుకోలేక ఆర్థికంగా, సామాజికంగా, సాంఘికంగా నష్టపోతున్నట్లు తెలిపారు. బాలికల నుండి అందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడు తమకు జరిగిన నష్టాన్ని నివారించుకోవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా మహిళలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆమె వివరించారు. అచ్యుత డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పల్లి శేషగిరిరావు మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న బాలికల రక్షణ కొరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 30 సంవత్సరాలుగా విద్యా సంస్థ నడుపుతున్నామని, ఇంతవరకు తమ విద్యాసంస్థలో బాలికలపై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని చెప్పారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురంలో మహిళలకు రక్షణగా పోలీసు యంత్రాంగం నిరంతరం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లోకదాలత్ వైస్ ప్రెసిడెంట్ పివి రమణ, ఎస్ఐ వెంకట్రావు, ఎలమంచిలి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సెక్రటరీ శ్రీహరి, శంకర్రావు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి ఉద్యోగి రాజుకు పితృ వియోగం

ప్రజాశక్తి - విశాఖపట్నం

అప్పలనాయుడు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ కేంద్రంలో ప్రొడక్షన్ డిపార్టుమెంట్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న గవర రాజు తండ్రి గవర అప్పనాయుడు అనారోగ్యంతో మంగళవారం నగరంలోని ఓ ఆసుపత్రిలో కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అప్పలనాయుడు మృతి విషయం తెలిసిన వెంటనే ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు వేపగుంట సమీపంలోని ముత్యమాంబ కాలనీకి వెళ్లి అప్పలనాయుడు పార్థివ దేహం వద్ద నివాళ్లర్పించారు. రాజు కుటుంబీకులను పరామర్శించారు. అప్పలనాయుడు మృతికి ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, సిజిఎం వై.అచ్యుతరావు, విశాఖ జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు వై.సత్యనారాయణ, సిబ్బంది సంతాపం తెలిపారు. కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

నివాళులర్పిస్తున్న ప్రజాశక్తి జనరల్ మేనేజర్ వెంకటేశ్వరరావు, సంస్థ సిబ్బంది

భద్రతా పరికరాలను పరిశీలిస్తున్న అతిథులు

ముగిసిన జాతీయ భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి-పరవాడ

పరవాడలోని జేఎన్‌పీసీలో ఉన్న ఎస్ఎన్ఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో 54వ జాతీయ భద్రతా వారోత్సవాలు ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. వారోత్సవాల్లో భాగంగా ఈహెచ్ఎస్ విభాగం ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు డిబెట్, క్విజ్, డ్రాయింగ్ పోటీలు, భద్రతా నినాదాలు, రంగోలి వివిధ పోటీలను నిర్వహించారు. సమీపంలోని పరవాడ పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్ పోటీ నిర్వహించారు. ముగింపు వేడుకకు ముఖ్య అతిథిగా జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్‌రెడ్డి, ఎస్ఎన్ఎఫ్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కుమారేసన్ రాజేంద్రన్, ఫ్యాక్టరీ మేనేజర్ పాండవ ప్రసాద్ హాజరయ్యారు. భద్రతా కార్యక్రమాలు, పోటీలలో విజేతలను సత్కరించారు. ఈ వారోత్సవాలు భద్రతా చైతన్యాన్ని పెంపొందించడంలో ముఖ్యమైన పాత్రను పోషించాయని అతిథిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ కార్మికులు, యాజమాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దాకమర్రి లేఅవుట్ ధరల తగ్గింపు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ

విశాఖపట్నం, రాయపూర్ జాతీయ రహదారిని అనుకొని, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అత్యంత చేరువలో, విజయనగరానికి దగ్గరలో, విద్యాసంస్థలకు సమీపాన, సకల సదుపాయాలతో విఎంఆర్‌డిఎ అభివృద్ధి చేసిన దాకమర్రి లేఅవుట్, ఫార్చ్యూన్ హిల్స్‌లోని నివాస స్థలాల ధరలు అందరికీ అందుబాటులో ఉండే విధంగా రాష్ట్ర స్థాయి కమిటీ నిర్ణయం తీసుకుందని విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ ప్రకటనలో తెలిపారు. పురపాలక శాఖ కమిషనర్, డైరెక్టర్ ఆమోదంతో రూ.20వేల నుంచి రూ.15,500కు తగ్గించామని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హిజ్రాల నూకాంబిక ఆలయం ద్వితీయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-యలమంచిలి

మున్సిపాలిటీ పరిధి శేషుకొండ కాలనీలో ఏర్పాటు చేసిన హిజ్రాల నూకాంబిక ఆలయం ద్వితీయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. హిజ్రాలు పసుపు, కుంకుమలు సమర్పించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వహకులు పిహెచ్ శ్రావణి, యేసు, రూప, సుప్రియ, సంగీత, అన్నపూర్ణ, లత, గాయత్రి పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-పరవాడ

: పరవాడ మండలం భర్ణికం గ్రామంలో ఉన్న న్యూ హెూప్ హెూంలోని పదో తరగతి విద్యార్థులకు రియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పరీక్షా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా రియా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎండి రాజ్ మాట్లాడుతూ గ్రామంలో విద్యార్థులకు, వృద్ధులకు, మహిళలకు వివిధ సేవా కార్యక్రమాలు, యువకులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించే వాళ్లమని చెప్పారు. 80 మంది విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ చదివిస్తున్న న్యూ హెూప్ హెూం నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రియా ఫౌండేషన్ డైరెక్టర్ జె.గౌతమి, పి.ఈశ్వర్ రావు, జె.ప్రేమ్ కుమార్, యం.నాగేశ్వరరావు, న్యూ హెూప్ హెూం నిర్వాహకులు బి రవి కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రిని పంపిణీ చేస్తున్న రియా ఫౌండేషన్ ప్రతినిధులు

తాగునీటి బోరు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

తాగునీటి బోర్లు ఏర్పాటు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండల పరిషత్తు నిధుల బుచ్చయ్యపేటలో గ్రామంలో రైతుల కల్లాల వద్ద తాగునీటి బోర్లు నిర్మాణ పనులను ఎంపిపి దాకారపు నాగేశ్వరావు దేవి, విశాఖ డెయిరీ డైరెక్టర్లు గేదెల సత్యనారాయణ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుంకర లక్ష్మి, ఎంపిటిసి సూరిశెట్టి వెంకటరమణ, డొంకిన అప్పలనాయుడు టిడిపి మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ పాతాళ శ్రీను, పూడి రామారావు, గంధం చిరంజీవి, డొంకిన చిరంజీవి, శనివాడ శ్రీను, తాటికొండ కాంతారావు, పాల సంఘం అధ్యక్షులు సుంకర బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

అణు విద్యుత్ పరిశ్రమతో అపార నష్టం

మాట్లాడుతున్న బుద్ధ రాజేష్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లాకి అణు విద్యుత్ పరిశ్రమ తీసుకురావాలని కొంతమంది స్థానికేతర ప్రజాప్రతినిధులు చాలా తీవ్రంగా శ్రమిస్తున్నారని, దీనిని అనకాపల్లి జిల్లా ప్రజల తరఫున తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఉత్తరాంధ్ర చర్చా వేదిక నాయకులు బుద్ధ రాజేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత పది పదిహేను సంవత్సరాల నుంచి శ్రీకాకుళం జిల్లా ప్రజలు తమకు ఈ అణు పరిశ్రమ వద్దని పోరాడి విజయం సాధించారని తెలిపారు. మొన్న సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లి నుండి గెలిచిన నాన్ లోకల్ లీడర్ ఈ పరిశ్రమ తీసుకురావడానికి తహతహ పడుతున్నారని విమర్శించారు. ఇప్పటికే పరవాడ అచ్యుతాపురం ఎస్ఈజెడ్లో కెమికల్స్ పరిశ్రమల వల్ల కాలుష్యం పెరిగిందని, ఇప్పుడు కొత్తగా అణు విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల జిల్లా ప్రజలందరూ అనారోగ్య సమస్యలతో బాధపడవలసి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని అన్ని రాజకీయ పార్టీలు ముక్తకంఠంతో వ్యతిరేకించాలన్నారు. పార్లమెంటు, అసెంబ్లీలో ఈ సమస్య మీద అనకాపల్లి జిల్లాలో ఉన్న ప్రజాప్రతినిధులు అందరూ వ్యతిరేకించాలని కోరారు. ఒకవేళ స్థానికేతర ప్రజాప్రతినిధులకు అంత ఉత్సాహం ఉంటే తమ సొంత జిల్లాలో తీసుకెళ్లి అణు విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిందిగా సూచించారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే రైల్వే బ్రిడ్జి ప్రమాదం

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా రవాణా శాఖ, మైన్స్, పోలీసు శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే రైల్వే అండర్ బ్రిడ్జి ప్రమాదం జరిగిందని మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా వస్తున్న అధికలోడు లారీలను అనకాపల్లి పట్టణంలోకి రాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అధికలోడుతో నిబంధనలకు విరుద్ధంగా లారీలు వెళ్తున్నా చర్యలు తీసుకోలేని రవాణా అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారం రోజుల కిందట తుమ్మపాలలో అధిక లోడుతో అధిక వేగంతో నిబంధనలకు విరుద్ధంగా పెద్ద పెద్ద బండ రాళ్లతో వస్తున్న లారీలను తాను అడ్డుకొని పోలీసులకు అప్పగించానని గుర్తు చేశారు. ఆయినప్పటికీ అనకాపల్లి ఆర్టీవో, మైన్స్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఎప్పుడు ఫిర్యాదు చేసినా ఆర్టీవో అధికారులు కంటితుడుపు చర్యగా చేస్తున్నారే తప్ప కఠినంగా వ్యవహరించడం లేదని, అందుకే ఈ ప్రమాదాలు తరుచూ జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు.

తీర రేఖలో..

జోరుగా సిఐఎస్ఎఫ్ సైక్లోథాన్

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పోర్టు చైర్మన్ అంగముత్తు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

జాతీయ భద్రత, డ్రగ్స్ అనర్థాలపై తీర రేఖ వెంబడి చేపట్టిన సిఐఎస్ఎఫ్ సైక్లోథాన్ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మంగళవారం జోరుగా సాగింది. ఈ సైక్లోథాన్ను విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు మంగళవారం ఉదయం ఆర్కె బీచ్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ యాత్ర సాయంత్రానికి అన్నవరం చేరుకోనుంది. సిఐఎస్ఎఫ్ 56వ రైజింగ్ డేను పురస్కరించుకొని ఈ సైక్లోథాన్ సాగుతోంది. భారత తూర్పు, పడమటి తీర ప్రాంతాలను కవర్ చేస్తూ 6553 కిలోమీటర్ల తీర రేఖను చుట్టేయనుంది. తీర ప్రాంత ప్రజలకు జాతీయ భద్రతపై అవగాహన కల్పించడం, ఉగ్రవాదం, మాదక ద్రవ్యాలు, ఆయుధాలు, విస్ఫోటక పదార్థాలపై జనంలో చైతన్యం రేకెత్తించడం లక్ష్యంతో ఈ యాత్ర సాగుతోందని పోర్ట్ కార్యదర్శి టి.వేణు గోపాల్ తెలిపారు. ఈ సైక్లోథాన్కు మద్దతుగా నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమ సైకిళ్లతో ర్యాలీలో పాల్గొన్నారు.

యలమంచిలి : దేశంలోని కోస్తా ప్రాంతంలో డ్రగ్స్ స్మగ్లింగ్, ఒంటరి మహిళల ట్రాఫికింగ్, యువత డ్రగ్స్కు బానిసలు కావడం వంటి సమస్యల నుండి విముక్తిపై అవగాహన కల్పిస్తూ చేపట్టిన సైకిల్మారథాన్ మంగళవారం యలమంచిలి చేరుకుంది. వారికి మున్సిపల్ చైర్పర్సన్ రమాకుమారి, కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్ల ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. స్థానిక గురప్ప కల్యాణమండపంలో వారికి భోజన ఏర్పాట్లు చేశారు. సేఫ్టీ అండ్ సెక్యూరిటీ, ఉమెన్ ట్రాఫికింగ్, డ్రగ్స్ స్మగ్లింగ్, వినియోగం మొదలైన అంశాల గురించి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సిఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ సతీష్కుమార్ బాజ్పేయి, డిప్యూటీ కమాండెంట్ వికాస్కుమార్ సాహూ తెలిపారు. కార్యక్రమంలో సిఐఎస్ఎఫ్ ఇన్స్పెక్టర్ కె.కుమార్, ఎంఆర్ఓ వరహాలరావు, టిపిఓ శ్రీలక్ష్మి, ఎన్జీవో అధ్యక్షులు వీరభద్రరావు, ఎక్స్ ఆర్మీ ప్రెసిడెంట్ సత్యనారాయణ, టౌన్ ఎస్ఐ సావిత్రి, డాక్టర్ సుభాష్, మున్సిపల్ ఉపాధ్యక్షులు ఆరెపు గుప్తా, కౌన్సిలర్లు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కశింకోట : సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ వారు ఈ నెల 7న పశ్చిమ బెంగాల్లో ప్రారంభించిన సైకిల్ ర్యాలీ మంగళవారం కశింకోట చేరింది. స్థానిక రాజీవ్ గాంధీ ఆర్ఇసిఎస్ పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు వారికి స్వాగతం పలికారు. ర్యాలీలో పాల్గొన్న 79 మంది జవాన్లు విద్యార్థులతో, సిబ్బందితో, గ్రామస్తులతో మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ ఉమా శంకర్ మాట్లాడుతూ ఇటువంటి బృహత్తర కార్యక్రమంలో తమ కళాశాలను భాగస్వామిని చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. బృందం వారికి కళాశాల ప్రిన్సిపాల్ సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పరమేశ్వరావు, వేగి గోపికృష్ణ పాల్గొన్నారు.

సైకిల్ యాత్రలో పాల్గొన్న సిఐఎస్ఎఫ్ సిబ్బంది

363 కిలోల గంజాయి పట్టివేత

ఏడుగురు యువకుల అరెస్టు

పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఆనందపురం-అనకాపల్లి జాతీయ రహదారి-16లో మర్రిపాలెం టోల్గేట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 363 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గంజాయి తరలిస్తున్న ఏడుగురు యువకులను అరెస్టు చేశారు. ఈ మేరకు సబ్బవరం పోలీస్ స్టేషన్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను పరవాడ డిఎస్పి వి.విష్ణు స్వరూప్ వెల్లడించారు. ఎఎస్ఆర్ జిల్లా చింతపల్లి ఎఓబి బోర్డర్ నుండి పూణేకు పార్చునర్ కారులో గంజాయి తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు స్థానిక సిఐ పిన్నింటి రమణ తమ సిబ్బందితో మర్రిపాలెం టోల్గేట్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అటుగా వచ్చి కారును తనిఖీ చేయగా, అందులో 169 ప్యాకెట్లలో 363.8 కిలోల పట్టుబడింది. గంజాయి తరలిస్తున్న కారుతో పాటు పైలట్ కారులో వస్తున్న అల్లూరి జిల్లాకు చెందిన ఆరుగురిని, ఒడిశాకు చెందిన ఒకరిని అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో సమిరెడ్డి విజయ్, వంతల హరీష్ బాబు, మడభాతుల అరుణ్ కుమార్, సాగర్ శివాజీ గోఫనే, కొర్ర మహేష్ బాబు, ఎన్.రమణ, సరమండ అనిల్ కుమార్ ఉన్నారు. రెండు కారులను సీజ్ చేసి, వారి నుండి రూ.50వేలు నగదు, ఐదు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నామని డిఎస్పి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి.సింహాచలం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ హుండీ లెక్కింపులో మాయ

- ఉత్తరాంధ్ర చర్చావేదిక నేతలు ఆడప నరసింహమూర్తి, దొండా నానాజీ
- వెండి, బంగారు ఆభరణాలు చూపించలేదని ఆరోపణ

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం వడ్డాది శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు సందర్భంగా భక్తులు సమర్పించిన వెండి, బంగారు ఆభరణాలను హుండీ లెక్కింపులో చూపించకుండా మాయం చేశారని ఉత్తరాంధ్ర చర్చే వేదిక కన్వీనర్ ఆడప నరసింహమూర్తి, దొండా నానాజీ మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈనెల 10 నుండి 15వ తేదీ వరకు కళ్యాణోత్సవాలు జరిగిన నేపథ్యంలో సోమవారం దేవాదాయ శాఖ ఈవో శర్మ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేశారని, రూ.12,75,666 డబ్బులు మాత్రమే చూపించారని, భక్తులు వేసిన వెండి బంగారం ఆభరణాలు చూపించలేదని పేర్కొన్నారు. వడ్డాది గ్రామానికి చెందిన కురందాసు రమణ మొక్కు తీర్చుకోవడంలో భాగంగా తన భార్య ఒంటిపై ఉన్న తాడు, చెవి దిద్దులు, ముక్కుపుడక, కాళ్ల పట్టీలు, రూ.3వేలు చిల్లర కాసులు కలిసి మూటకట్టి హుండీలో వేశారని తెలిపారు. సుమారు తులమున్నర బంగారం, వెండి పట్టీలు హుండీ లెక్కల్లో చూపించలేదని తెలిపారు. దేవాలయంలో ఇలాంటి నీచ పనులు చేయటం సిగ్గుచేటన్నారు. నిలువు దోపిడీ ఇచ్చిన బంగారం వెండి ఆభరణాలపై తక్షణమే వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏడాది ఇలానే జరిగి ఉంటుందని, అందువల్ల ఆలయ ఇఒను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

నేడు సరుగుడు తోట వేలం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట :మండలంలోని తురకలపూడి రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 191లో 79-80 సెంట్లు విస్తీర్ణం గల ప్రభుత్వ చెరువు స్వామినాయుడు చెరువు ఆక్రమణ భూమిలో ఉన్న సరుగుడు తోటకు బుధవారం తురకలపూడి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద వేలంపాట నిర్వహిస్తున్నట్లు మండల తహశీల్దార్ ఎం.లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు సరుగుడు తోట వేలంపాటలో వచ్చిన నగదును గ్రామపంచాయతీ ఖాతాలో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు వేలంపాటలో పాల్గొనవచ్చునని ఆమె తెలిపారు.

మీటర్ రీడర్స్కు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఏపి విద్యుత్ సంస్థలో పని చేస్తున్న మీటర్ రీడర్స్కు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎస్క్రో అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని మీటర్ రీడర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అనకాపల్లి ఈపీడీసీఎల్ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి మీటర్ రీడర్స్ కష్టపడి పని చేస్తున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్స్ అందుబాటులోనికి రావడం వల్ల రీడర్స్కు సంస్థలో వారి అర్హతలు బట్టి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో కోరిబిల్లి శంకరరావు, శ్యామలరావు, పివి రమణ, కె.లోవరాజు, సత్యనారాయణపాల్గొన్నారు.

భగత్ సింగ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : దేశ స్వాతంత్య్రం కోసం బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వీరోచిత పోరాటాలు నిర్వహించిన భగత్ సింగ్ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవుల 94వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సదస్సు నిర్వహించారు. 'మాదకద్రవ్యాలు - విద్యార్థి యువతపై ప్రభావం' అనే అంశంపై ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అనకాపల్లి రూరల్ ఎస్సై నాగేశ్వరరావు ముందుగా భగత్సింగ్, రాజ్గురు, సుఖదేవుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సై నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి జీవితంలో లక్ష్యం పెట్టుకోవాలని సూచించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వారి జీవితాలను ఆదర్శంగా తీసుకొని జీవితంలో విజయం సాధించాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్గురు, సుఖదేవ్లు బ్రిటిష్ బానిసత్వం నుంచి విముక్తి చేయాలని ఎన్నో ఉద్యమాలు నిర్వహించి ప్రాణ త్యాగాలకు కూడా వెనకాడ లేదని తెలిపారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వియ్యపు రాజు మాట్లాడుతూ భగత్ సింగ్ సుఖదేవుల జీవిత చరిత్రను విద్యార్థులు తెలుసుకోవలసిన బాధ్యత, అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జగదీష్, సింహాద్రి కళాశాల లెక్చరర్ గోవిందరావు, పాల్గొన్నారు.

భగత్ సింగ్, రాజ్గురు, సుఖదేవ్ చిత్ర పటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించాలి

గమేలాలు పట్టుకొని నిరసన తెలుపుతున్న కూలీలు

ప్రజాశక్తి- మాడుగుల : ఉపాధి బిల్లు బకాయిలను చెల్లించాలని కోరుతూ మంగళవారం మండలంలోని ఎంకె వల్లపురం, ఘాటి రోడ్డు కాలువ పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీలు మంగళవారం పనిప్రదేశంలోనే గమేలాలు పట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఉపాధి కూలీల ఆందోళనకు సంఘీభావం తెలిపిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఇరట నరసింహమూర్తి మాట్లాడుతూ, రెండు నెలల నుండి బిల్లులు చెల్లించకపోతే, పనులు చేస్తున్నా బిల్లులు అందక కుటుంబాలతో కూలీలు పస్తులుండాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసారు. తక్షణమే పేస్లిప్పులు అందజేసి, వేసవి అలవెన్స్‌తో కూడిన పెండింగ్ ఉపాధి బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు..వ్యవసాయ కార్మికులకు పనులు లేక ఉపాధి కరువై నిత్యం వందలాది మంది పొట్టచేత పట్టుకుని ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నా ప్రభుత్వ పరంగా వలసలు నివారణకు గానీ, కూలీలకు ఉపాధి కల్పనకు చర్యలు ఏపట్టకపోవడం దారుణమన్నారు. ఒకే జాబ్‌కార్డులో నలుగురైదుగురు పనులకు వెళ్లేవారుంటే వారందరికీ వందరోజుల పని మాత్రమే పరిమితం చేయడంతో ఒక్కొక్కరికి నెలరోజులకు మించి పని దొరకడం లేదని, ఇలాగైతే వారి పోషణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఉపాధి హామీ చట్టంలోని ఇటువంటి లోపాలను సవరించాలని, జాబ్‌కార్డుల ప్రాతిపదికన కాకుండా వ్యక్తుల వారీగా కనీసం ఒక్కొక్కరికీ ఏడాదిలో వందరోజుల పనికల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగా వేసవిలో మండుటెండల్లో ఉపాధి పనిలో పాల్గొన్న కూలీలకు వేసవి అలవెన్స్‌గా ఉపాధి కూలీతోపాటు 30శాతం అదనంగా ఇవ్వాలని, కూలీలకు పనిముట్లు, పనిప్రదేశంలో తాగునీరు, వైద్యం, టెంట్లు ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి రైతులను, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని కోరారు. మస్టర్లను ఉపాధి సిబ్బందికి మాత్రమే ఇవ్వాలని రాజకీయ జోక్యం ఉండరాదని,వలస కార్మికులకు గుర్తింపు కార్డులిచ్చి ఉచితంగా రవాణా సౌకర్యం, బియ్యం, గ్యాస్ బండ అందించాలని అన్నారు. ప్రమాదాల్లో చనిపోయిన కుటుంబాలకు బీమా కింద రూ.25 లక్షల పరిహారం, రెండెకరాల భూమి ఇవ్వాలని కోరారు. తెలంగాణలో మాదిరిగా పేద కూలీలకు ఏటా రూ.12వేలు సాయం ఇవ్వాలని, 3 సెంట్లు స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షలఆర్థికసాయం ఇవ్వాలని కోరారు. ప్రతి దళిత కాలనీకి 2 ఎకరాల భూమి శ్మశాన స్థలంకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాకర దేవి,కోట్ని లక్ష్మికోట్ని సత్యవతి, గొల్లవిల్లి కోటమ్మ, కోమరి సూరిబాబు కూలీలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు అదనపు సాయం

మండలంలో 694 మంది గుర్తింపు : ఎఇ

అసంపూర్తి ఇళ్లను గుర్తిస్తున్న హౌసింగ్ అధికారులు

ప్రజాశక్తి -కోటవురట్ల : గత ప్రభుత్వంలో మంజూరై అసంపూర్తిగా నిలిచిపోయిన బిసి, ఎస్‌సి, ఎస్‌టి కులాలకు చెందిన గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు సాయానికి అర్హులను గుర్తించినట్లు స్థానిక హౌసింగ్ ఎఇ వరప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గ్రామాల్లో పర్యటించి, అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ మేరకు మండల వ్యాప్తంగా 694 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని, వారిలో బిసి, ఎస్‌సి లబ్ధిదారులకు అదనంగా రూ50వేలు, ఎస్‌టి లబ్ధిదారులకు రూ.75వేలు, పివిటిజిలకు రూ.లక్ష ఆర్థికసాయాన్ని అదనంగా ప్రభుత్వం అందిస్తుందన్నారు. గ్రామాల వారీగా ఏఎస్ పేట 18 మంది, అన్నవరం 19, బికెపల్లి 12, బోడపాలెం 72, చిన్న బొడ్డేపల్లి 16, చౌడువాడ 17, గొట్టువాడ 9, జల్లూరు 4, కైలాస పట్నం 47, సుంకపూరు 16, కొడవటిపూడి 31, కోటవురట్ల 135, లింగాపురం 20, నీలిగుంట 8, పాములవాక 62, పొందూరు 19, పీకే పల్లి 35, రాజుపేట 19, రామచంద్రపాలెం 23, టీ జగ్గంపేట 13, తంగేడు 41, వెంకటాపురం 12, ఎండపల్లి 13, మొత్తగా 694 మంది లబ్ధిదారులను గుర్తించినట్లు వెల్లడించారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా తయారీ

మాట్లాడుతున్న ఇఆర్‌ఒ దయానిధి

ప్రజాశక్తి-నక్కపల్లి : నక్కపల్లి తహసిల్దార్ కార్యాలయంలో పాయకరావుపేట నియోజకవర్గం ఇఆర్‌ఒ దయానిధి మంగళవారం నాలుగు మండలాల తహశీల్దార్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఓటర్ల నమోదు, పోలింగ్ స్టేషన్‌ల గురించి చర్చించారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీ, పోలింగ్ స్టేషన్‌ల హేతుబద్ధీకరణకు రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసిల్దార్ నరసింహమూర్తి, డిడి అన్నాజీ రావు పాల్గొన్నారు.

మోకాలి శస్త్రచికిత్సలకు స్వస్తి

కిమ్స్ హాస్పిటల్స్ న్యూరో, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ వెంకటేష్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మోకాలి శస్త్రచికిత్సకు ఇకపై స్వస్తి పలకవచ్చని, మినిమల్లీ ఇన్వాసివ్‌తో ఉపశమనం పొందవచ్చని కిమ్స్ హాస్పిటల్స్ (విశాఖపట్నం) న్యూరో, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ వెంకటేష్ పోతుల మంగళవారం మీడియాతో మాట్లాడారు.

రోజువారీ జీవనాన్ని ప్రభావితం చేసే తీవ్రమైన మోకాలి నొప్పికి. చాలా మందికి మోకాలి మార్పిడి శస్త్రచికిత్స తప్పనిసరి అనిపించవచ్చన్నారు. ఇప్పుడు కొత్త మినిమల్లీ ఇన్వాసివ్ ప్రక్రియ, జెనిక్యులర్ ఆర్టరీ ఎంబోలైజేషన్ (జిఎఈ) అనే ప్రత్యామ్నాయ ప్రక్రియతో అనవసర రక్తప్రసరణను నియంత్రించి, తద్వారా నొప్పిని తగ్గించవచ్చన్నారు. చాలా మందికి కొద్ది రోజులలోపే నొప్పి నుంచి ఉపశమనం లభించి, సహజంగా స్వస్థతకు ఆస్కారం ఏర్పడుతుందన్నారు. ఇది శస్త్రచికిత్స లేకుండా ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం కల్పిస్తుందన్నారు.

క్లినికల్ పరీక్షల ప్రకారం, ఈ ప్రక్రియ మోకాలి నొప్పిని తగ్గించడం లోనూ, రోగుల కదలికను మెరుగుపరచడంలోనూ విజయవంతంగా పని చేస్తుందన్నారు. 65 ఏళ్ల రోగి ఈ చికిత్స తర్వాత ఒక నెలలోనే 80 శాతం నొప్పి తగ్గిందని, .50 ఏళ్ల మాజీ క్రీడాకారుడు మోకాలి గాయాల వల్ల నొప్పి మందులపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించుకోగలిగారన్నారు. మోకాలి సమస్యలకు శస్త్రచికిత్స లేకుండా ఈ విధానం కొత్త మార్గం చూపుతుందన్నారు.

పిహెచ్‌సిని సందర్శించిన ఎంపిపి

ప్రజాశక్తి- మాడుగుల : మండలంలోని కేజే పురం పిహెచ్‌సిని మంగళవారం ఎంపిపి తాళ్లపరెడ్డి వెంకటరాజారామ్ సందర్శించారు. ఆసుపత్రిలో సౌకర్యాలు, వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిలో సమావేశ మందిరం సమస్య ఉందని స్థానిక డాక్టర్ లీలాపాత్రుడు ఎంపిపి దృష్టికి తేగా, వెంటనే స్పందించి, మండల పరిషత్ నిధుల నుంచి రూ.రెండు లక్షల వరకు మంజూరు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. సిబ్బంది హాజరు, ఇతర రికార్డులను పరిశీలించి, ఎటువంటి ఆరోపణలకు తావులేకుండా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు.


వైద్యులతో మాట్లాడుతున్న ఎంపిపి

కుళాయి కనెక్షన్లకు బిగించిన అనధికార మోటార్లు తొలగింపు

అక్రమ కనెక్షన్లు పరిశీలిస్తున్న ఎంపిడిఒ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ

ప్రజాశక్తి- మాడుగుల : మండలంలోని పోతనపూడి అగ్రహారం గ్రామంలో కుళాయి కనెక్షన్లకు అనధికారికంగా బిగించిన విద్యుత్ మోటార్లును మంగళవారం అధికారులు తొలగించారు. గ్రామంలోని రక్షితనీటి పథకం కుళాయిల ద్వారా శివారు ప్రాంతాలకు తాగునీరు పూర్తిస్థాయిలో అందడం లేదని గ్రామస్తులు ఫిర్యాదు మేరకు మంగళవారం ఎంపిడిఒ కొంకి అప్పారావు, ఆర్డబ్ల్యూఎస్ ఎఇఇ నాగమల్లేశ్వరి పర్యటించి ,పరిశీలించారు. ఈ సందర్భంగా 20 కుటుంబాల వారు అనాధికారికంగా మోటార్లను ఏర్పాటు చేసుకొని మేడపై ఉన్న ట్యాంకర్లకు నీటిని తోడేస్తున్నట్లు గుర్తించి, వారిపై ఎంపిడిఒ ఆగ్రహం వ్యక్తం చేశారు.వెంటనే మోటార్లను తొలగించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వీరవిల్లి అగ్రహారంలో స్పందన ఫిర్యాదులపై సర్వే చేశామని ఎంపిడిఒ తెలిపారు. సర్వేలో సమస్యలు పరిష్కారం అయిన వారితో వేలిముద్రలు తీసుకున్నామని, సమస్యలు పరిష్కారం కాని వాటికి తగు కారణాలను వివరిస్తూ వారికి తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోరుకొండ భవాని సాంబమూర్తి, పడాల దేముడు, బంటు సోమునాయుడు సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

తారురోడ్ల అధ్వానస్థితిపై సర్వే

సర్వే చేస్తున్న ఆర్‌అండ్‌బి అధికారులు

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గొలుగొండ మండలంలో తారురోడ్ల దుస్థితిపై ఆర్అండ్‌బి అధికారులు సర్వే చేపట్టారు. మంళవారం గొలుగొండ మండలం కృష్ణదేవిపేట వద్ద సర్వే నిర్వహించారు. ఆర్అండ్‌బి జెఇఇ ప్రసాద్ మాట్లాడుతూ.నర్సీపట్నం దేవీపట్నం, తాళ్లపాలెం, తుని తదితర ప్రాంతాల్లో తారురోడ్ల ప్రస్తుత పరిస్థితిపై సర్వే చేశామని, సర్వే నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న లచ్చన్న

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : ఖరీఫ్‌లో ప్రతి రైతు 30 రకాల నవధాన్యాల విత్తనాలు ముందుగా వేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సీహెచ్.లచ్చన్న తెలిపారు. మంగళవారం గొలుగొండలో ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రాజెక్ట్ మేనేజర్ మాట్లాడుతూ, మండలంలో అగ్రికల్చర్, హార్టికల్చర్, వెలుగు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కలిసి ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళిక రూపొందించారని, ఈ విధానంలో సాగును ప్రోత్సహించేలా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు.కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుధారాణి పాల్గొన్నారు.

అనారోగ్యంతో విఆర్‌ఒ మృతి

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో పందూరు గ్రామ రెవెన్యూ అధికారి జి సన్యాసిరాజు (46) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. గడిచిన 6 నెలలుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ సెలవు తీసుకుని బెంగళూరు,హైదరాబాద్,సహ వివిధ ప్రాంతాల్లో చికిత్స పొందుతున్నారు. ఇటీవల ఆరోగ్య పరిస్థితి పూర్తిగా విషమించడంతో ఇంటి వద్దనే చికిత్స తీసుకుంటూ మంగళవారం ఉదయం మృతి చెందారు. సన్యాసిరాజుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. విఆర్‌ఒ కుటుంబాన్ని డిటి రమేష్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, రెవెన్యూ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు పరామర్శించారు.

రేషన్ కార్డుదారులకు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : రేషన్ కార్డులో ఐదేళ్లనుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని గొలుగొండ తహశీల్దార్ పి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ. ఈ నెల 25వ తేదీలోగా ప్రతి ఒక్కరూ ఇకెవైసి చేయించుకోవాలన్నారు. గ్రామాల్లో రేషన్‌డీలర్ల వద్ద ఇకెవైసి చేయించుకోవాల్సిన సభ్యుల జాబితాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆయా రేషన్ షాపుల డీలర్ వద్దకెళ్లి ఇకెవైసి చేయించుకోవాలని, ఇకెవైసి పూర్తికాని సభ్యులకు రేషన్ షాప్ ద్వారా సరుకులను పొందే అవకాశం ఉండదన్నారు డిటి చయనులు, సివిల్ సప్లై డిటి చందన రేఖ పాల్గొన్నారు.

గూడుపమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని రేబాక లో గూడుపమ్మ తల్లి ఆలయంలో మంగళవారం భక్తులు పోటెత్తారు. గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, జనసేన నేత తోట నగేష్, కుటమి నాయకులు కోసూరి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. గోత్రనామాలతో ఆలయంలో పూజలు నిర్వహించారు.ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరిరాజు ఆధ్వర్యంలో తోట నగేష్‌కు ఆలయ అర్చకులు అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

టిడ్కో ఇళ్లను తక్షణమే పంపిణీ చేయాలి

బలిఘట్టంలో టిడ్కో ఇళ్ల పరిశీలనలో కోటేశ్వరరావు, సిపిఎం నేతలు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా సిపిఎం బృందం బలిఘట్టంలోని టిడ్కో ఇళ్లను టిడ్కో లబ్ధిదారులతో సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు మాట్లాడుతూ నర్సీపట్నం మున్సిపాలిటీలో పేదలకు 1824 ఇళ్లను గత టిడిపి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇళ్ళ నిర్మాణం పూర్తి అయినప్పటికీ తాగు నీరు, మరుగుదొడ్లు, రోడ్లు, కరెంట్, డ్రైనేజీ వంటి సౌకర్యాలు కల్పించకపోడంతో లబ్ధిదారులకు పంపిణీ చేయలేదన్నారు .ఇళ్లను నిర్మించి ఏళ్ల గడుస్తున్నా వినియోగించక పోవడంతో పాడయ్యే పరిస్థితి ఉందని ప్రభుత్వాలు ఇప్పటికీ ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడం దౌర్భాగ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు టిడ్కో లబ్ధిదారుల నెలసరి బ్యాంకు రుణాన్ని వడ్డీతో వాయిదాలు చెల్లించక తప్పడం లేదని వాపోయారు.టిడిపి నేతృత్వంలోనే కొత్తగా అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి, టిడ్కో కాలనీల్లో మౌలిక సదుపాయాలను కల్పించి, లబ్ధిదారులకు అందజేయాలని కోరారు. ప్రభుత్వం, అధికారులు స్పందించకుంటే, సిపిఎం ఆధ్వర్యంలో గృహప్రవేశాలు చేయిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, రాము, శేషు లబ్ధిదారులు పాల్గొన్నారు.

జీడి రైతులను ఆదుకోవాలి

కె.కోటపాడు : జీడి మామిడి రైతులను ఆదుకోవాలని సిపిఎం నాయకులు గండి నాయనబాబు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మండలంలోని సింగన్నదొరపాలెం, దాలివలస, కింతాడ, ఆర్లి, కె.సంతపాలెం, గొంపవానిపాలెం గ్రామాల్లో సమస్యలను తెలుసుని, వాటిపై వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయనబాబు మాట్లాడుతూ జీడి పిక్కలకు కేజీకి రూ.200 ఇచ్చి రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు వనము సూర్యనారాయణ, యర్రా దేవుడు, ఈర్లే నాయుడు బాబు, జీడి రైతులు నిమిడితల్లి దేవుడుబాబు, అప్పారావు, కె.రాము, కె.సీతారాం,

కె.కోటపాడులో ప్రజలతో మాట్లాడుతున్న సిపిఎం బృందం

ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం నేతలు

బి.మల్లేశ్వరి, సీత పాల్గొన్నారు

సాగు ప్రాప్తికి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలివ్వాలి

అనకాపల్లి డెస్క్ : గ్రామాల్లో ప్రజాసమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టడమే లక్ష్యంగా ప్రజాచైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం గొలుగొండ మండలం బుద్దడపాడులో ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో అత్యధికంగా గిరిజన రైతులు సాగు చేస్తున్న భూములకు సాగు నమోదు కాలేదన్నారు. తక్షణమే సాగు నమోదు చేసి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, మండల కార్యదర్శి ఎం.రాజు, శివ, పండు, రమణమ్మ పాల్గొన్నారు.

కె.2 కాలనీలో సమస్యలను తెలుసుకుంటున్న గంగారావు

మధురవాడ : ప్రజా చైతన్య యాత్రలో భాగంగా కె.2 కాలనీలో మంగళవారం సిపిఎం మధురవాడ జోన్ నాయకులతో కలిసి 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు ఇంటింటికీ తిరిగి ప్రజలసమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, పేద, దినసరి వేతనాలతో జీవిస్తున్న కొమ్మాది కె2, జెఎన్ఎన్‌యుఆర్ఎం.కాలనీలో పలు సమస్యలు పీడిస్తున్నాయన్నారు. కాలనీ నిర్మాణ దశలోనే నాణ్యత, ప్రమాణాలు పాటించక పోవడం వల్ల కాలనీలో నివసిస్తున్న ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 764 గృహాలున్న కాలనీలో కనీస సదుపాయాలు లేవన్నారు. పేదలు నివసించే ఇలాంటి కాలనీలలో పర్యటించి, సమస్యలు పరిష్కారం కోసం ప్రజలను కదిలించి పోరాటం చేస్తామని తెలిపారు. సిపిఎం నాయకులు డి.అప్పలరాజు, పి.రాజుకుమార్, కె.వెంకటప్పారావు, కార్యకర్తలు ఎల్.పద్మ, వై.అప్పన్న, యశిన్ బాబా, శైలజ, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా జివిఎంసి 62వ వార్డు పరిధి త్రినాధపురం, అల్లూరి సీతారామరాజు కాలనీ, దుర్గానగర్‌లో ప్రజా సమస్యలపై

సమస్యలడిగి తెలుసుకుంటున్న బాబూరావు, పైడిరాజు

ప్రజా సమస్యలనడిగి తెలుసుకుంటున్న జగ్గునాయుడు

సర్వే నిర్వహించారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ప్రజల దగ్గరకు నేరుగా వెళ్లి సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఇళ్ల పట్టాలు, పేదలు డబ్బులు కట్టి ఇల్లు రాని వారు, ఇంటి పన్నులు మార్పు, గ్యాస్ డబ్బులు రానివారు, కరెంటు చార్జీలు పెరిగాయని పలు సమస్యలను సిపిఎం దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి సిపిఎం చేసే కృషిలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, ఏరియా కార్యదర్శి బి.అర్జునరావు, కార్యకర్తలు రాంబాబు, గణేష్, సురేష్, లెనిన్, సింహాద్రప్పడు పాల్గొన్నారు.

జివిఎంసి 61వ వార్డు పరిధి మల్కాపురం గొల్ల వీధి, పల్లె వీధిలో సిపిఎం కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. టిడ్కో ఇళ్లకు డబ్బులు కట్టించుకొని ఇంతవ రకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కొంచంగిలో ఇల్లు చూపించి పట్టాలిచ్చారని, డ్రైనేజీ మరమ్మతుల సమస్యలను సిపిఎం నాయకుల దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. ఈ సర్వే కార్యక్రమంలో సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, నాయకులు ఉరికూటి బాబూరావు, ఏరియా కార్యదర్శి ఎస్.ఉమ, కార్యకర్తలు ఎం.కృష్ణారావు, ఎన్.విజయ, నమ్మి మహాలక్ష్మి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సిపిఎం ఆధ్వర్యంలో మండలంలోని అసకపల్లి ఆటో స్టాండ్ వద్ద సబ్బవరం నుండి అనకాపల్లి వెళ్లే రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజ్ కాలువ దగ్గర నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఉప్పాడ సత్యవతి మాట్లాడుతూ ఆటో స్టాండ్ రోడ్డు పక్కన పెద్ద కాలువ వల్ల జనాలు ఇబ్బంది పడుతున్నారని, పంచాయతీ అధికారులు స్పందించి వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కరణం శ్రీను, బలిరెడ్డి చిన్న అప్పారావు, కర్రి శ్రీను, నాయుడు, అంగటి అప్పలనాయుడు, చల్ల అప్పారావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరంలో పారిశుద్ధ్య సమస్యపై నిరసిస్తున్న సిపిఎం నేతలు

నేడు నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : జివిఎంసి ఎనిమిదో జోన్ పరిధిలోనివివిధ ప్రాంతాలకు వెళ్లే పైపులైను మరమ్మతుల కారణంగా ఈనెల 19న బుధవారం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ విభాగంకార్య నిర్వాహక ఇంజనీరు మురళీకృష్ణ మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. కృష్ణాపురం హెడ్ వాటర్ వర్క్స్ పంప్ హౌస్‌లో గల పంపుసెట్లు మరమతుకు గురైనందున తాటిపూడి ప్రధాన పైప్‌లైన్ ద్వారామంచి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, తాటిపూడి ప్రధాన పైప్ లైన్ పైన ఉన్న బల్క్ (రెసిడెన్షియల్), ఇండస్ట్రీస్ నీటి వినియోగదారులకు, జోన్-8 పరిధిలోని 93 నుంచి 98 వార్డుల్లోని సాయిదుర్గా నగర్, దుర్గానగర్, కృష్ణా నగర్, అప్పలనరసింహం కాలనీ, వెంకట సాయినగర్, బంట కాలనీ, రవి నగర్ లక్ష్మీపురం, పోర్ట్ కాలనీ, రామ కోఆపరేటివ్ కాలనీ, హెచ్‌బి కాలనీ, గోకుల్దాంకాలనీ, రెల్లివీధి, కష్టరాయపురం, గొల్లివిల్లివానిపాలెం, ఎల్ఐసి కాలనీ, సుజాతనగర్, పాపయ్య రాజుపాలెం,పెందుర్తి పాత గ్రామం, తెలకలవీధి, జెడ్ .పి. హెచ్ఎస్ ఏరియా, ప్రశాంతి నగర్, క్రాంతి నగర్, వుడా కాలనీ, రైల్వే కాలనీ, సావిత్రి నగర్, అప్పన్నపాలెం, సింహపురి లేఅవుట్, అడివివరం, ఎస్సీ కాలనీ, పాత అడివివరం, అడివివరం తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

ఆటోలో వదిలిన బంగారాన్ని తిరిగి ఇస్తున్న ఆటోడ్రైవర్ అంజి

ప్రజాశక్తి- నక్కపల్లి : ఆటోలో ప్రయాణికులాలు మరిచిపోయిన బంగారాన్ని బాధితురాలికి అందించి ఆటోడ్రైవర్ గెడ్డమూరి అంజి నిజాయితీని ప్రదర్శించారు. నక్కపల్లికి చెందిన బిక్కవోలు శిరీష సోమవారం నక్కపల్లిలో ఆటో ఎక్కి తుని వెళ్లింది. తన వెంట బ్యాగులో తెచ్చుకున్న 8 తులాల బంగారాన్ని ఆటోలో మరిచిపోయి, దిగి వెళ్ళిపోయింది. ఆటోదిగి కొంతసేపు పోయిన తర్వాత బంగారంతో ఉన్న బ్యాగు గుర్తుకు రావడంతో వెంటనే నక్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈలోగా ఆటో డ్రైవర్ గెడ్డమూరి అంజి తన ఆటోలో బంగారం వదిలి వెళ్ళిన వారి ఆచూకీ తెలుసుకొని మంగళవారం నక్కపల్లి వచ్చి పోలీస్ స్టేషన్‌లో సిఐ కుమారస్వామి సమక్షంలో బిక్కవోలు శిరీష కు అందజేశాడు. ఆటో డ్రైవర్ అంజి నిజాయితీనిసిఐ కుమారస్వామి అభినందిస్తూ, నగదు ప్రోత్సాహాన్ని అందజేశారు.

నీలిగుంటలో కూలీలందరికీ ఉపాధి కల్పన

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలోని నీలిగుంట గ్రామంలో జాబ్‌కార్డులున్న ఉపాధి కూలీలందరికీ పనికల్పనకు అధికారులు చర్యలు చేపట్టారు. నీలిగుంట గ్రామంలో సోమవారం గ్రామంలోనినాలుగు గ్రూపుల ఉపాధి కూలీలకే పని కల్పించారని మిగతా 18 గ్రూపు సభ్యులందరికీ పని "లేదంటూ గ్రామ సర్పంచ్ వరహాలబాబు సమక్షంలో గ్రామంలో ఉపాధి కూలీలు నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఉపాధి ఏపిఒ నాగరాజు మంగళవారం గ్రామానికి చేరుకుని గ్రామంలోని గ్రూపులన్నిటికీ చెరువులో పని కల్పించారు. సమస్య సద్దుమణిగడంతో కూలీలంతా ఉపాధి పనుల్లో పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో పాల్గొన్న కూలీలు

భవిత కేంద్రానికి సామగ్రి వితరణ

భవిత కేంద్రానికి ఎన్‌టిపిసి అందజేసిన సామగ్రి

ప్రజాశక్తి -కొత్తకోట/ రావికమతం : మండల కేంద్రంలోని భవిత కేంద్రంలోని చిన్నారులకు పరవాడ ఎన్‌టిపిసి సిఎస్ఆర్ నిధులు రూ.82లక్షలతో విలువైన బోధనోపకరణ సామగ్రిని వితరణగా అందజేశారు. రావికమతం మండల భవిత కేంద్రానికి, మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సహిత విద్యా విభాగం రిసోర్స్ రూమ్‌కు వీటిని అందించారు. మంగళవారం రావికమతం ఎంఇఒ సిహెచ్ తలుపులు, మేడివాడ హైస్కూల్ హెచ్ఎం వంకాయల రామారావు ద్వారా ప్రత్యేక ఉపాధ్యాయులు బి. మహాలక్ష్మినాయుడు, జగన్నాధ నాయుడులకు అందించారు. ఈ సంద ర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలున్న పిల్లలు అన్ని రంగాల్లో రాణించే లా తీర్చిదిద్దాలని పిలుపు నిచ్చారు. మండలంలో చదువుకుంటున్న వికలాంగ విద్యార్థులకు బోధనోపకరణ సామాగ్రిని అందించిన పరవాడ ఎన్‌టిపిసికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక ఉపాధ్యాయులు బి.మహాలక్ష్మి నాయుడు మాట్లాడుతూ పరవాడ ఎన్‌టిపిసి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద జిల్లా వ్యాప్తంగా 24 భవిత కేంద్రాలకు, ఆరు రిసోర్స్ రూమ్ కు కలిపి మొత్తంగా 30 కేంద్రాలకు రూ 13కోట్ల విలువ చేసే బోధనోప కరణ సామాగ్రిని అందించారన్నారు. వీటిలో స్పీచ్ ట్రైనర్, ఫిజియోథెరపీ, స్టిమ్యులేటర్, ఆటిజం విద్యార్థులకు స్టెప్ఇన్ మెటీరియల్, ఫిజియోథెరపీ బాల్, స్పీచ్ థెరపి మిర్రర్, వికలాంగ విద్యార్థులకుప్రత్యేక శిక్షణను అందించేందుకు రౌండ్ టేబుల్, ఐదు కుర్చీలు ఉన్నాయన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా రవాణా, ఎస్కార్ట్ అలవెన్స్, హోంబేస్డ్ అలవెన్స్, గర్ల్స్ స్టైఫండ్‌కింద రావికమతం మండలంలోని 128మంది వికలాంగ విద్యార్థులకు రూ 3.56లక్షలను వారి ఖాతాల్లో జమచేశారన్నారు. కార్యక్రమంలో మేడివాడ ఉన్నత పాఠశాలఉపాధ్యాయ సిబ్బంది నాగేశ్వరరావు, అప్పలనాయుడు, ఎర్రయ్య, రమణాజీ, పాపారావు, నాగమణి, శాంతి దేవి, కృష్ణవేణి, పద్మావతి, అన్నపూర్ణ, నాగేశ్వరరావు, సిఆర్పి శ్యాంసుందర్, లోవరాజు, ప్రత్యేక ఉపాధ్యాయులు జగన్నాధ నాయుడు,సరోజిని పాల్గొన్నారు.